# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 156 | విశాఖపట్నం | 8-3-2026 ఆదివారం | చీఫ్ ఎడిటర్ : ఎల్. కృష్ణరావు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 156 | VISAKHAPATNAM | 8-3-2026 SUNDAY | CHIEF EDITOR: L.KRISHNA RAO | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram



రిపోర్టర్లు కావలెను

పతాకం న్యూస్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు శ్రీకాకుళం, పాడేరు, గోదావరి జిల్లాలు తో పాటు ఆంధ్రప్రదేశ్‌లో గల రాయలసీమ, జిల్లాలో జిల్లా రిపోర్టర్స్ కావలెను.

అనుభవం ఉన్న వారికి మొదట ప్రాధాన్యత ఇవ్వబడును.

ప్రతి వార్త ఉన్నది ఉన్నట్టుగా రాసి చూపిద్దాం రండి...

ఆఫీస్ ఇన్‌చార్జ్: డి. లావణ్య

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

9516171797, 9491286902




2లో

### తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో 130 మంది మావోయిస్టుల లొంగుబాటు



3లో

### టాస్క్ ఫోర్స్ మెరుపు దాడులతో.. కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్ ముఠా గుట్టురట్టు..



6లో

### ప్రీ డయాబెటిస్ ఎందుకు వస్తుంది..?



# రెచ్చిపోతున్న మట్టి, గ్రావెల్, ఇసుక మాఫియా?

**విజయనగరం, పతాకం న్యూస్:** బొబ్బిలి మండలంలో మట్టి, గ్రావెల్, ఇసుక మాఫియా పేట్రేగిపోతుంది. రాత్రిళ్లు మట్టి, గ్రావెల్ తవ్వకాలు చేపడుతుండగా, తెల్లవారుజామున వేగావతి నదిలో ఇసుకను తోడేస్తోంది. ఫలితంగా చెరువులు, నదులు స్వరూపాన్ని కోల్పోతున్నాయి. అక్రమ తవ్వకాలను కట్టడి చేయాల్సిన యంత్రాంగం పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఈ మాఫియాకు కొందరు పోలీసు, రెవెన్యూ, భూగర్భ గనులశాఖ అధికారులు సహకరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వేగావతి నదీ పరివాహక గ్రామాలైన పారాది, అలజంగి, పెంట, కారాడ గ్రామాల్లో పెద్ద ఎత్తున ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. ప్రతిరోజూ తెల్లవారుజామున 4 గంటల నుంచే ఈ ప్రాంతాల్లో ఇసుక తవ్వకాలు మొదలవుతుంటాయి. ట్రాక్టర్ ఇసుకను రూ.3 వేలకు పట్టణంలో విక్రయిస్తూ ఇసుక మాఫియా సొమ్ము చేసుకుంటోంది. ఈ మాఫియాకు అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు సహకరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇష్టారాజ్యంగా చేపడుతున్న ఇసుక తవ్వకాలతో వేగావతి నది స్వరూపం మారిపోతుంది. 8 అడుగుల లోతున తవ్వకాలు చేపడుతుండడంతో నీటి బావులు కుంగిపోతున్నాయి. దీనివల్ల తాగునీటికి సమీప గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కోమటిపల్లి పరిధి బోనేడు చెరువులో గత కొన్నేళ్లుగా భారీ ఎత్తున మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. ప్రతి రోజూ రాత్రి 10 గంటలు దాటిన తరువాత లారీలు, యంత్రాలు ఈ చెరువు వద్దకు చేరుకుంటాయి. అక్రమార్కులు యంత్రాలతో తవ్విన మట్టిని లారీలకు లోడు చేసి పట్టణ సమీపంలోని లేఅవుట్లకు తరలిస్తున్నారు. లారీ మట్టి రూ.3 వేలకు విక్రయిస్తున్నారు. ఒక రాత్రిలో దాదాపు 60 లోడ్ల మట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఉదయమంతా ఆ లారీలు పాత బొబ్బిలి వద్ద ఉన్న ఓ పెట్రోలు బంకు ఆవరణలో పార్కింగ్ చేసి ఉంటాయి. అధికార పార్టీకి చెందిన ఓ వ్యక్తి ఈ దందా సాగిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అందుకే రెవెన్యూ అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. పాతబొబ్బిలి వద్ద పోలీసు చెక్ పోస్టు ఉన్నా వారు కూడా పట్టించుకోవడం లేదు. మట్టి, గ్రావెల్ తవ్వకాలపై స్థానికులు భూగర్భ గనుల శాఖ విజిలెన్స్ విభాగానికి ముందస్తు సమాచారం ఇచ్చినా చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

# భవిష్యత్‌లో అనేక దేశాలకు మన విద్యుత్: చంద్రబాబు



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** అనేక దేశాల అభివృద్ధిలో భారతీయుల పాత్ర ఉందని సీఎం చంద్రబాబు అన్నారు. ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా భారతీయులు కనిపిస్తారన్నారు. సంస్కరణల వల్లే మన దేశం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ- అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఢిల్లీలో నిర్వహించిన 'రైసినా డైలాగ్' సదస్సులో చంద్రబాబు మాట్లాడారు. కేంద్రంతో కలిసి ముందుకెళుతున్నట్లు చెప్పారు. ఐటీలో భారతీయుల పరిజ్ఞానం అందరికీ తెలిసిందే. డిప్లమసీ, ఫ్లెక్సిబిలిటీ విషయాల్లో భారతీయులకు మంచి పేరుంది. గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి దిశగా భారత్ దూసుకెళ్తొంది. మన దేశం భవిష్యత్లో అనేక దేశాలకు విద్యుత్ ఇస్తుంది. విదేశాలకు వెళ్లే విద్యార్థుల్లో ఎక్కువ శాతం ఏపీ వాళ్లే ఉన్నారు. ప్రస్తుతం అనేక దేశాల్లో వృద్ధులు పెరుగుతున్నారు. దక్షిణాదిలో సంతానోత్పత్తి రేటు 1.5శాతమే ఉంది. 30 ఏళ్ల క్రితం కుటుంబ నియంత్రణ పాటించాలని చెప్పాం. ఇప్పుడు ఇద్దరు, అంతకంటే ఎక్కువ మంది పిల్లలు ఉండాలని చెబుతున్నా. ఇద్దరు కంటే ఎక్కువ మంది పిల్లలు ఉన్నవారికి అనేక ప్రయోజనాలు కల్పిస్తాం. భవిష్యత్లో గ్లోబల్ కమ్యూనిటీకి సేవ చేసే సామర్థ్యం భారతే ఉంది. వృద్ధుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో పాపులేషన్ మేనేజ్మెంట్ చాలా కీలకం. విభిన్నంగా ఆలోచించే వారికోసం అమరావతిలో క్రియేటివ్ సిటీ, డ్రోన్ సిటీ, ఏరో స్పేస్, ఎలక్ట్రానిక్ సిటీలు కూడా నిర్మిస్తున్నాం. భవిష్యత్లో ఆరోగ్య రంగంలో పెను మార్పులు వస్తాయి. త్వరలో డ్రోన్ అంబులెన్స్‌లు కూడా వస్తున్నాయి" అని అన్నారు.

# ఏపీ లస్కర్ల వేతనాల్లో భారీ పెంపు: నిమ్మల



**అమరావతి, పతాకం న్యూస్:** ఆంధ్ర ప్రదేశ్ జలవనరుల శాఖలో క్షేత్రస్థాయిలో కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్న పొరుగు సేవల లస్కర్ల దశాబ్దాల నిరీక్షణకు తెరపడింది. ప్రస్తుతం రోజుకు రూ. 350గా ఉన్న వీరి వేతనాన్ని రూ. 550కి పెంచుతూ మంత్రి నిమ్మల రామానాయుడు నిర్ణయం తీసుకున్నారు. దీనివల్ల ప్రతి లస్కర్ నెలకు అదనంగా రూ. 6,000 పొందనున్నారు.



## లడ్డూ ప్రసాదంపై చంద్రబాబు కుట్రపూరిత ఆరోపణలు: సజ్జల

2లో



## జగన్‌పై లోకేశ్ ఫైర్

2లో




## కాకినాడ అర్బన్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ షేక్ పర్వీన్ సుల్తానా సస్పెండ్

కాకినాడ, పతాకం న్యూస్: మెడికల్ షాపు నిర్వాహకులను పలు ఇబ్బందులకు గురి చేస్తున్న కాకినాడ అర్బన్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ షేక్ పర్వీన్ సుల్తానా ఎట్టకేలకు సస్పెండ్ అయ్యారు. సుల్తానాపై అవినీతి ఆరోపణలు రావడంతో ప్రభుత్వం ఆయనను సస్పెండ్ చేసింది. గత కొన్నాళ్లుగా సుల్తానా మెడికల్ షాప్ నిర్వాహకులను ఇబ్బందులకు గురి చేయడంతో పాటు డబ్బులు ఇవ్వాలని.. లేకపోతే మెడికల్ షాప్ లైసెన్స్ రద్దు చేస్తానని బెదిరించేవారు. దీంతో సుల్తానాపై మెడికల్ షాప్ నిర్వాహకులు కలెక్టర్, ఎంపీకి ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన ప్రభుత్వం కాకినాడ అర్బన్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ షేక్ పర్వీన్ సుల్తానా సస్పెండ్ చేసింది. సుల్తానా సస్పెండ్ పట్ల మెడికల్ షాప్ నిర్వాహకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అవినీతి అధికారానికి నూకలు చెల్లయ్ అని, గంటలు వ్యవధిలోనే అవినీతి అధికారి సుల్తానాను సస్పెండ్ చేసిన ప్రభుత్వానిక్లి మెడికల్ షాప్ నిర్వాహకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.



5లో

## పట్టణాలకు ముప్పు 'అర్బన్ ఛాలెంజ్ ఫండ్'!



## ఇక మీపై దాడులు చేయబోం, క్షమించండి: గల్ఫ్ దేశాలకు సారీ చెప్పిన ఇరాన్ అధ్యక్షుడు

2లో

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## స్వాహా..

బిజెపి ఏ ప్రాంతీయ పార్టీతో చెలిమి చేసినా దాన్ని మింగేయడం ఖాయమని బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ రాజ్యసభకు నామినేషన్ వెయ్యడంతో మరోసారి రుజువయ్యింది. త్వరలోనే నితీశ్ కుమార్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయడం, ఆ వెనువెంటనే బిజెపి నేత సిఎం కావడం జరుగుతుంది. త్వరలో బీహార్‌లో ఏర్పడ బోయే నూతన ప్రభుత్వానికి తన సహకారం ఉంటుందని నామినేషన్‌కు ముందు సామాజిక మాధ్యమాల్లో నితీశ్ ప్రకటనలోనే ఈ విషయం విదితమయ్యింది. శాసనసభ, శాసన మండలి, లోక్‌సభ సభ్యునిగానే పనిచేశాననీ రాజ్యసభకు కూడా సభ్యునిగా సేవలందించాలనేది తన ఆకాంక్ష అని ఆయన చెప్పుకొచ్చారు. తీవ్రమైన పోటీలో గెలిచి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నాలుగు నెలలకే రాజ్యసభ సభ్యత్వం మీద అంత మక్కువ ఎందుకు కలిగిందో అందరికీ తెలిసిందే! అసెంబ్లీ ఎన్నికల అనంతరం 89 సీట్లు గెలిచిన బిజెపి 85 సీట్లు పొందిన జెడి(యు)కు ముఖ్యమంత్రి పదవి ఇచ్చిననాడే ఈ పరిణామాన్ని విశ్లేషకులు ఊహించారు. 'మేం ముందునుంచే చెప్పాం. నితీశ్ ఆరు నెలలకంటే ఎక్కువ కాలం ఆ పదవిలో ఉండరన్నాం. అంతేకాదు, బిజెపి ఎవరితో పొత్తు పెట్టుకున్నా.. వారిని నాశనం చేసిన చరిత్ర ఉంది. ఒబిసిలు, దళితులు, గిరిజనులకు అనుకూలంగా నిలిచే నాయకత్వాన్ని బిజెపి కోరుకోవడం లేదు. నితీశ్ కుమార్‌ను కేంద్ర రాజకీయాలకు పంపడం బీహార్ ప్రజల తీర్పునకు విరుద్ధం' అన్న బీహార్ ప్రతి పక్ష నేత తేజస్వీ వ్యాఖ్యలను ఎవరూ కాదనలేరు. ఇంతకు ముందు మహారాష్ట్రలో మాదిరిగానే ఇప్పుడు బీహార్‌లో జరిగింది. శివసేన పార్టీతో బిజెపి చెలిమి చేసి ఆ పార్టీని చీల్చి, ఒక ముక్కను అక్కున చేర్చుకొని అప్పటికి ముఖ్య మంత్రి పదవినిచ్చి ఎన్నికలయ్యాక కమలనాథుడ్ని గద్దెనెక్కించారు. మహారాష్ట్రలో మరో ప్రధాన పార్టీగావున్న ఎన్‌సిపిని అలాగే చేశారు. అంతకుముందు గోవాలో ఎంజిపిని మింగేశారు. ఒడిషాలో బిజెడిని బుజ్జగిస్తూనే ఆ పార్టీని కూడా కరి మింగిన వెలగ పండు చందం గావించారు. ఏ రాష్ట్రంలోనైనా కమలం పార్టీ తీరు అదే! ఒకే దేశం... ఒకే పార్టీ... ఒకే నేత సిద్ధాంతం గల బిజెపికి ప్రాంతీయ పార్టీల పొడ గిట్టదు. సైద్ధాంతికంగానే ఆ పార్టీ అందుకు వ్యతిరేకం. కేంద్రీకరణ వారి విధానం కనుకనే రాష్ట్రాల హక్కుల్ని ఒక్కొక్కటిగా హరిస్తూ వస్తున్నారు. వాటికి చట్టబద్ధంగా ఇవ్వాల్సిన నిధులను సైతం బిగబడుతున్నారు. ప్రజాస్వామ్యం పట్ల కూడా బిజెపికి నిబద్ధత కరువే. అటువంటి పార్టీతో చెలిమి చేసినవారు నష్టపోక తప్పదన్నది చరిత్ర చెప్పిన సత్యం. కేవలం నష్టపోవడమే కాదు క్రమంగా అంతరించిపోయే పరిస్థితి కూడా ఏర్పడుతుంది. అటువంటి భయం తోనే అకాలీదళ్ వంటి పార్టీలు జాగ్రత్త పడినట్టు కనిపిస్తుంది. తెలుగు రాష్ట్రాల్లోని ప్రాంతీయ పార్టీలు బిజెపి పంచన చేరడం ద్వారా తెలుగు ప్రజలకు తీరని హాని కలిగిస్తున్నాయి. విభజన చట్టం ద్వారా కల్పించవలసిన ప్రత్యేక హోదా ఎగ్గొట్టడమేగాక ఇతర హామీలనూ విస్మరించిన బిజెపితో ప్రత్యక్ష లేదా పరోక్ష నెయ్యం నెరపడం ద్రోహపూరిత చర్య. అసెంబ్లీలోనూ బయటా ఒకరిపై ఇంకొకరు కత్తులు దూసుకునేలా వ్యవహరించే టిడిపి వైసిపిలు బిజెపి విషయంలో మాత్రం ఏకాభిప్రాయమే ప్రదర్శించడం పచ్చి అవకాశవాదమే కదా! గతంలో రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఏకోన్ముఖంగా బిజెపి అభ్యర్థులకు ఓటు వేయడం, కేంద్రం తెచ్చిన దాదాపు అన్ని బిల్లులనూ ఇరు పార్టీలూ సమర్థించడం దారుణం. తమను తాము లౌకిక పార్టీలుగా చెప్పుకొంటూ మతతత్వ బిజెపితో చెలిమి చేయడం ప్రజలను మోసగించడమే. 2024 ఎన్నికల్లో సొంతంగా మెజార్టీ పొందలేని బిజెపి ప్రభుత్వం మనగలగడానికి ఆక్సిజన్ అందిస్తున్న టిడిపి ఇప్పటికైనా పునరాలోచించాలి. కేంద్ర, బడ్జెట్‌లో రాష్ట్రానికి తగిన కేటాయింపుల్లేవు. కేంద్రం నుండి గ్రాంట్లు సైతం ఏడాదికేడాది తగ్గిపోతూ వస్తున్నాయని శుక్రవారంనాడు అసెంబ్లీలో ప్రవేశపెట్టిన కాగ్ నివేదిక కూడా పేర్కొంది. రాష్ట్రానికి తీవ్రమైన చేటు చేస్తున్న బిజెపితో చెలిమి విషయాన్ని టిడిపి సమీక్షించుకొని ధృతరాష్ట్ర కౌగిలిని వదిలించుకోవడం విజ్ఞతగా వుంటుంది. లేదా జెడి(యు) మాదిరి కావడానికి సన్నద్ధమైపోవాలి! తస్మాత్ జాగ్రత్త!

## పద్మావతి మహిళా యూనివర్సిటీ పరిశోధనలు అనేక జాతీయ సంస్థలకు ఉపయోగం: గవర్నర్ అబ్దుల్ నజీర్



**తిరుపతి, పతాకం న్యూస్:** పద్మావతి మహిళా యూనివర్సిటీ పరిశోధనలు అనేక జాతీయ సంస్థలకు ఉపయోగకరమని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ వ్యాఖ్యానించారు. ఈ పరిశోధనలు కేవలం ప్రయోగశాలలకు మాత్రమే పరిమితం కాకూడదని సూచించారు. అవి సమాజ అభివృద్ధికి ఉపయోగపడేలా ఉండాలని ఆకాంక్షించారు. తిరుపతిలోని పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో 22వ స్నాతకోత్సవ వేడుకలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గవర్నర్, ఆయన సతీమణి సమీరా నజీర్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా కలెక్టర్, ఎస్పీ, నగరపాలక సంస్థ కమిషనర్, స్థానిక ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలు, ఇతర విశ్వవిద్యాలయాల వైస్ చాన్స్‌లర్లు పాల్గొన్నారు. విశ్వవిద్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన ఈ స్నాతకోత్సవం ఉత్సాహభరితంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రముఖ క్షిపణి శాస్త్రవేత్త శశికళ సిన్హాకు గౌరవ డాక్టరేట్‌ను గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రదానం చేశారు. శాస్త్ర సాంకేతిక రంగంలో ఆమె చేసిన సేవలను గుర్తిస్తూ ఈ గౌరవాన్ని అందించారు. స్నాతకోత్సవ వేడుకల్లో విద్యార్థులకు పెద్ద సంఖ్యలో పురస్కారాలు ప్రదానం చేశారు. విశ్వవిద్యాలయంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మొత్తం 102 బంగారు పతకాలు అందజేశారు. అదేవిధంగా పలువురు విద్యార్థులకు నగదు బహుమతులు కూడా ప్రదానం చేశారు. ఈ వేడుకలో భాగంగా 2591 మంది విద్యార్థులకు పీహెచ్‌డీ, ఎంఫిల్, పీజీ డిగ్రీలు ప్రదానం చేశారు. విద్యార్థులు తమ కుటుంబ సభ్యుల సమక్షంలో డిగ్రీలు స్వీకరించి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగిస్తూ పలు ముఖ్య అంశాలను ప్రస్తావించారు. విద్య మనిషికి కేవలం ఉద్యోగ అవకాశాలకే కాకుండా బాధ్యత, మార్గదర్శనం, లక్ష్య నిర్దేశం కూడా ఇస్తుందని వ్యాఖ్యానించారు. చదువుకున్న మహిళలు కేవలం తమ కుటుంబాల అభివృద్ధికే కాకుండా దేశ ఆర్థిక ప్రగతికి, సామాజిక స్థిరత్వానికి కూడా ప్రధాన కారణమవుతారనిపేర్కొన్నారు.

## తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో 130 మంది మావోయిస్టుల లొంగుబాటు



**హైదరాబాద్, పతాకం న్యూస్:** మావోయిస్టు కీలక నేత గణపతి లొంగిపోవాలని, ఆయనకు ఆర్థిక, ఆరోగ్య భద్రత కల్పిస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ముఖ్యమంత్రి సమక్షంలో 130 మంది మావోయిస్టులు లొంగిపోయారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, మావోయిస్టులపై అవకాశం ఉన్న కేసులను ఎత్తివేస్తామని తెలిపారు. లొంగిపోయిన వారికి ఆర్థిక, ఆరోగ్య భద్రత ప్రభుత్వానిదే బాధ్యత అన్నారు. లొంగిపోయిన మావోయిస్టులు లేవనెత్తే ప్రతి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని అన్నారు. ఇంత పెద్ద ఎత్తున ఆయుధాలతో మావోయిస్టులు లొంగిపోవడం చరిత్రలో ఇదే మొదటిసారి అని గుర్తు చేశారు. వారు తమకు వైద్య సాయం కావాలని కోరారని, అందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. వారికి మంచి ఆర్థిక సాయం అందించే ప్రయత్నం చేస్తామని అన్నారు. లొంగిపోయిన మావోయిస్టులకు భూమి ఇచ్చే విషయం ఇప్పుడే ఏమీ చెప్పలేనని వెల్లడించారు. అజ్ఞాతంలో ఉన్న మిగిలిన మావోయిస్టులు కూడా లొంగిపోవాలని విజ్ఞప్తి చేశారు. గణపతి లొంగిపోతే ఆయన ఆరోగ్యానికి, ఆర్థిక భద్రతకు హామీ ఇస్తామని స్పష్టం చేశారు. మావోయిస్టుల లొంగుబాటు కోసం అధికారులు చాలా కృషి చేశారని ప్రశంసించారు. శాంతియుత చర్చల ద్వారానే ఎలాంటి సమస్యనైనా పరిష్కరించగలుగుతామని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్రస్థాయిలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. లొంగిపోయిన మావోయిస్టులు తమకు ఆసక్తి ఉంటే రాజకీయాల్లోకి రావొచ్చని ముఖ్యమంత్రి అన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరాలనుకుంటే కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మహేశ్ కుమార్ గౌడ్ ఎప్పుడూ అందుబాటులో ఉంటారని తెలిపారు. ఇతర రాజకీయ పార్టీలలో చేరాలనుకున్నా అభ్యంతరం లేదని అన్నారు. సొంత గ్రామాల్లో ఇల్లు కట్టుకోవడానికి సహాయం చేస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రజాస్వామ్య మార్గంలో ప్రజా సమస్యలను చర్చిద్దామని పిలుపునిచ్చారు.

## అసెంబ్లీలో మత విద్వేషాలు రెచ్చగొట్టేలా మాట్లాడుతున్నారు: ఎమ్మెల్యే తాటిపర్తి



**అమరావతి, పతాకం న్యూస్:** అసెంబ్లీలో కూటమి ప్రభుత్వం వాస్తవ విరుద్ధమైన 'కాకి లెక్కలు' చెబుతూ కాలయాపన చేస్తోందని వైసీపీ ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ మండిపడ్డారు. వైసీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... ఎన్నికల సమయంలో ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీలను అమలు చేయమంటే, కూటమి నేతలు 'సూపర్ స్కామ్'లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై కాగ్ నివేదిక ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టిందని పేర్కొన్నారు. అసెంబ్లీలో అధికార పార్టీ సభ్యులు మత విద్వేషాలను రెచ్చగొట్టేలా మాట్లాడటం దురదృష్టకరమని, అటు మండలి చైర్మన్‌ను మతం పేరుతో అవమానించడం అత్యంత హేయమైన చర్య అని ధ్వజమెత్తారు. లడ్డూ ప్రసాదంపై చర్చ జరిగితే తమ తప్పులు బయటపడతాయనే భయంతోనే ప్రభుత్వం విష ప్రచారం చేస్తోందని విమర్శించారు. తిరుమల పవిత్రతను రాజకీయాల కోసం వాడుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జాబ్ క్యాలెండర్ గురించి అడిగితే మంత్రి లోకేశ్ కేవలం తేదీలు మారుస్తూ యువతను వంచిస్తున్నారని, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని విమర్శించారు.

## జగన్‌పై లోకేశ్ ఫైర్



**అమరావతి, పతాకం న్యూస్:** మాజీ సీఎం జగన్, గత వైసీపీ ప్రభుత్వంపై మంత్రి నారా లోకేశ్ మరోసారి విరుచుకుపడ్డారు. గత ప్రభుత్వం ఇచ్చిన మద్య నిషేధం హామీ గురించి ప్రస్తావిస్తూ.. సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో మంత్రి లోకేశ్ సంచలన పోస్ట్ చేశారు. ఒక ఆంగ్ల పత్రికలో వచ్చిన కథనాన్ని తన ట్వీట్‌కు అటాచ్ చేసిన మంత్రి.. 2019 ఎన్నికల్లో జగన్ ఇచ్చిన 'మద్య నిషేధం' హామీ వెనుక ఇదే నిజమైన స్టోరీనా అంటూ వ్యాఖ్యలు చేశారు. 'ప్రతి నెలా వంద కోట్ల రూపాయల కిక్‌బ్యాగ్స్, 3 వేల 500 కోట్లు మనీ లాండరింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ వెలికితీసిన రూ.1048 కోట్ల నగదు లావాదేవీల జాడ ఎక్కడ' అని ప్రశ్నించారు. ఒక ఆంగ్ల పత్రికలో వచ్చిన కథనాన్ని తన ట్వీట్‌కు అటాచ్ చేసిన లోకేశ్...'2019 ఎన్నికల్లో జగన్ మీరు ఇచ్చిన మద్య నిషేధం హామీ వెనుక ఇదే నిజమైన స్టోరీనా. మీరు మద్య నిషేధం గురించి ప్రసంగిస్తూ ఉండగానే ఆంధ్రప్రదేశ్‌లో అక్రమ మద్యం వేలాది కుటుంబాలను ఆర్థికంగా, ఆరోగ్యపరంగా నాశనం చేసింది. ఇదే టైంలో మీ అనుచరుల జేబులు వేలకోట్ల రూపాయిలతో నిండిపోయాయి. ఏపీ ప్రజలకు మీరు సమాధానం చెబుతారా? లేక మౌనంగా ఉండడమే మంచిది అనుకుంటున్నారా' అని ప్రశ్నిస్తూ ట్వీట్ చేశారు.

## జగన్‌ను ఎదుర్కోలేక చంద్రబాబు కుట్రపూరిత ఆరోపణలు చేస్తున్నారు: సజ్జల



**తాడేపల్లి, పతాకం న్యూస్:** వైసీపీ అధినేత జగన్ ను రాజకీయంగా ఎదుర్కోలేకే ముఖ్యమంత్రి చంద్రబాబు తిరుమల లడ్డూ ప్రసాదంపై కుట్రపూరిత ఆరోపణలు చేస్తున్నారని సజ్జల రామకృష్ణారెడ్డి మండిపడ్డారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు, కెమికల్స్ కలిపారంటూ చంద్రబాబు చేసిన ఆరోపణలు పచ్చి అబద్ధాలని సజ్జల కొట్టిపారేశారు. వైసీపీ హయాంలోనే తిరుమలలో అత్యున్నత ప్రమాణాలు కలిగిన క్వాలిటీ టెస్టింగ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశామని గుర్తుచేశారు. మార్కెట్‌లో హెరిటేజ్ నెయ్యి ధర కంటే ఇందాపూర్, అమూల్ నెయ్యి ధరలు తక్కువగా ఉన్నాయని... కేవలం కొన్ని సంస్థలకు లబ్ధి చేకూర్చడానికే నెయ్యి కాంట్రాక్టుల విషయంలో చంద్రబాబు రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. నెయ్యి కాంట్రాక్టుల వెనుక భారీ ఆర్థిక కుంభకోణం దాగి ఉందని, దీనిపై సీబీఐ విచారణ జరిపించాలని సజ్జల డిమాండ్ చేశారు. భక్తుల మనోభావాలను దెబ్బతీసి స్వామివారి సొమ్మును దోచుకోవడమే ఈ విష ప్రచారం వెనుక ఉన్న అసలు ఉద్దేశమని విమర్శించారు. టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడికి సంబంధించిన వీడియోల వివాదంపై సజ్జల స్పందిస్తూ... గతంలో తమ హయాంలో సినీ నటుడు పృథ్వీపై ఆరోపణలు రాగానే తక్షణమే రాజీనామా చేయించామని, కానీ ఇప్పుడు బీఆర్ నాయుడి విషయంలో చంద్రబాబు ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. బీఆర్ నాయుడు తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. భక్తుల విశ్వాసాలపై చంద్రబాబుకు విశ్వాసం లేదనే విషయం మరోసారి అర్థమయిందని అన్నారు.

## ఇక మీపై దాడులు చేయబోం, క్షమించండి: గల్ఫ్ దేశాలకు సారీ చెప్పిన ఇరాన్ అధ్యక్షుడు



**ఇరాన్:** అమెరికా, ఇజ్రాయెల్ దేశాలతో యుద్ధం కొనసాగుతున్న సమయంలో, గల్ఫ్ దేశాలకు ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ క్షమాపణలు చెప్పారు. అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య భీకర యుద్ధం ఎనిమిదో రోజుకు చేరుకుంది. ఇరాన్ గల్ఫ్ దేశాల్లోని అమెరికా ఆస్తులపై బాంబు దాడులు చేస్తోంది. తమ దేశంపై దాడులు చేస్తే ప్రతిదాడి చేస్తామని గల్ఫ్ దేశాలు కూడా ఇరాన్‌ను హెచ్చరించాయి. ఇలాంటి తరుణంలో ఈ కీలక పరిణామం చోటు చేసుకుంది. ఇరాన్ ప్రజలను ఉద్దేశించి అధ్యక్షుడు ఒక టీవీ ఛానల్‌లో మాట్లాడారు. గల్ఫ్ దేశాలపై ఇక ఎలాంటి దాడులు జరగబోవని పెజెష్కియాన్ కీలక ప్రకటన చేశారు. అయితే పొరుగు దేశాలు తమపై ప్రత్యక్ష దాడికి దిగితే మాత్రం స్పందించే హక్కు ఉందని స్పష్టం చేశారు. "ఇరాన్ దాడికి గురైన పొరుగు దేశాలకు నా తరపున, ఇరాన్ ప్రజల తరపున క్షమాపణలు చెబుతున్నాను. గల్ఫ్ దేశాలపై ఇక దాడులు జరగవు. ఇరాన్‌పై ఆ దేశాలు దాడి చేయకపోతే తాము కూడా ఎలాంటి క్షిపణులు ప్రయోగించకూడదని తాత్కాలిక నాయకత్వ మండలి నిర్ణయించింది" అని ఇరాన్ స్టేట్ టీవీలో ప్రజలను ఉద్దేశించి చేసిన ప్రసంగంలో పెజెష్కియాన్ ఈ వ్యాఖ్యలు చేశారు. పొరుగు దేశాలపై దాడులు చేయడం తమ ఉద్దేశం కానేకాదని అన్నారు. ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు మరింత తీవ్రం కాకూడదనే ఉద్దేశంతో గల్ఫ్ దేశాలపై దాడులు చేయకూడదని నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఇరాన్ లొంగిపోవాలన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలపై కూడా పెజెష్కియాన్ స్పందించారు. టెహ్రాన్ లొంగిపోయే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. ఇరాన్ లేదా ఇరాన్ ప్రజలు లొంగిపోవాలనే వారి కలలను వారు సమాధి చేసుకోవాలని వ్యాఖ్యానించారు.

# మ్యూజియం నిర్మాణ పనులను వేగవంతం చేయాలి: ఐటీడీఏ పీవో



**చింతపల్లి, పతాకం న్యూస్:** గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఇన్‌చార్జి జేసీ, ఐటీడీఏ పీవో టి.శ్రీపూజ ఆదేశించారు. ఆమె లంబసింగిలో నిర్మిస్తున్న గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం పనులను తనిఖీ చేశారు. తొలుత నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. నిర్మాణ పనులు నెమ్మదిగా జరుగుతున్నాయని ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మ్యూజియం నిర్మాణ పనులను నిర్ణీత సమయానికి పూర్తి చేయాలని, కాంట్రాక్టర్లు అదనపు కార్మికులను ఏర్పాటు చేసి పనుల వేగాన్ని పెంచాలన్నారు. మ్యూజియం నిర్మాణాలను మే 15 నాటికి పూర్తి చేయాలన్నారు. గిరిజన సంక్షేమశాఖ ఇంజనీరింగ్ అధికారులు పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తూ సకాలంలో పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. క్యూరేషన్ పనులను తనిఖీ చేసిన ఆమె స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలు, సంప్రదాయ ఆయుధాల నిర్మాణంలో ప్రత్యేక మెలకువలు పాటించాలన్నారు. మ్యూజియం అత్యంత సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. లంబసింగి మ్యూజియం గిరిజన ప్రాంతానికి తలమానికం కానుందని, ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లు ప్రత్యేక శ్రద్ధతో నాణ్యతాప్రమాణాలు పాటిస్తూ నిర్మాణాలు చేపట్టాలన్నారు. నిర్మాణ పనులకు నిధుల కొరత లేదన్నారు. పనులకు సంబంధించిన నిధులను ఎప్పటికప్పుడు చెల్లిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ ఈఈ డేవిడ్ రాజు, డీఈఈ రఘునాథరావునాయుడు, ఏఈఈ యాదకిశోర్, ట్రైబల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మాదారాణి పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాల తొలగింపు



**పెందుర్తి, పతాకం న్యూస్:** విశాఖపట్నం జిల్లాలోని పెందుర్తి మండలం చీమలపల్లిలో ప్రభుత్వ భూములపై అక్రమంగా నిర్మించిన పాకలపై రెవెన్యూ అధికారులు కఠిన చర్యలు చేపట్టారు. చీమలపల్లిలోని సర్వే నంబర్- 24లోని ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మించిన సుమారు 400 పాకలను అధికారులు తొలగించారు. పెందుర్తి ఎమ్మార్వో వెంకట అప్పారావు ఆధ్వర్యంలో ఈ తొలగింపులు చేపట్టారు. ఈ నిర్మాణాల తొలగింపుతో ఆ ప్రాంతంలో హై టెన్షన్ వాతావరణం నెలకొంది. ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మించిన ఈ పాకలను తొలగించేందుకు రెవెన్యూ అధికారులు భారీగా సిబ్బందిని మోహరించారు. అక్రమ నిర్మాణాలను తొలగించే ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఉండేందుకు పోలీసులు కూడా భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. ఈ చర్యల్లో భాగంగా వందమందికి పైగా పోలీసులు అక్కడ విధులు నిర్వర్తిస్తున్నారు. రెవెన్యూ సిబ్బంది, పోలీసుల సమక్షంలో జేసీబీలు ఉపయోగించి పాకలను కూల్చివేస్తూ ప్రభుత్వ భూమిని ఖాళీ చేస్తున్నారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మించిన ఈ పాకలను ఇటీవల గుర్తించారు. ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం ఆక్రమణలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వ భూములను ఆక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ చర్యల ద్వారా ప్రభుత్వానికి చెందిన భూమిని తిరిగి స్వాధీనం చేసుకుంటున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇకపై కూడా ఇలాంటి ఆక్రమణలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపడతామని పేర్కొన్నారు. స్థానికంగా అధికారుల చర్యలు చర్చనీయాంశంగా మారాయి. ఒకవైపు ప్రభుత్వ భూమిని కాపాడాలని అధికారులు చెబుతుండగా, మరోవైపు అక్కడ నివసిస్తున్న కొందరు ప్రజలు తమ పరిస్థితిని కూడా అధికారులు పరిగణనలోకి తీసుకోవాలని కోరుతున్నారు. అయితే ప్రభుత్వ భూములపై అక్రమ నిర్మాణాలు అనుమతించబోమని రెవెన్యూ అధికారులు స్పష్టం చేశారు.

## టాస్క్ ఫోర్స్ మెరుపు దాడులతో..
## కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్ ముఠా గుట్టురట్టు..



**హైదరాబాద్, పతాకం న్యూస్:** నగర ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెడుతూ కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్‌ను తయారు చేస్తున్న ఒక భారీ ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. హైదరాబాద్‌లోని లాలాపేట పరిధిలో నిర్వహిస్తున్న ఒక గోడౌన్ పై టాస్క్ ఫోర్స్ సికింద్రాబాద్ జోన్, లాలాగూడ పోలీసులు సంయుక్తంగా మెరుపుదాడులు నిర్వహించారు. సికింద్రాబాద్ జోన్ టాస్క్ ఫోర్స్ బృందానికి అందిన ముందస్తు సమాచారంతో, లాలాగూడ పోలీసులతో కలిసి లాలాపేటలోని 'జానీ అల్లం వెల్లుల్లి పేస్ట్' గోడౌన్ పై ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడిలో అత్యంత అపరిశుభ్రమైన వాతావారణంలో, ప్రమాదకర రసాయనాలను ఉపయోగించి అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. అల్లం, వెల్లుల్లి పేస్ట్ ఎక్కువ రోజులు నిల్వ ఉండాలని, రంగు మారకుండా ఉండటానికి నిందితులు ఎసిటిన్ యాసిడ్ వంటి రసాయనాలు కలుపుతున్నట్లు తేలింది. ఈ సోదాల్లో దాదాపు 1,915 కిలోల కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్, 30 కిలోల ఎసిటిక్ యాసిడ్, పేస్టు తయారీకి ఉపయోగించే యంత్రాలు, ఇతర ముడి సరుకులు, ప్యాకింగ్ మెటీరియల్ ని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు నీలా వెంకటేశ్వర్లుతో పాటు మరో ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. మొత్తం నలుగురు నిందితులను తదుపరి విచారణ నిమిత్తం లాలాగూడ పోలీసులకు అప్పగించారు. నకిలీ బ్రాండ్ లేబుల్స్ తో ప్యాకింగ్ చేసి నగరాల్లోని పలు కిరాణా దుకాణాలకు సరఫరా చేస్తున్నారని పోలీసులు తెలిపారు.

## ఆప్కాస్‌లో మరణించినవారి వారసులకు ఉద్యోగాలివ్వాలి



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** జివిఎంసి ఆప్కాస్ లో పనిచేసి మరణించిన, రిటైర్ అయిన పారిశుధ్య కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులను పనిలోకి తీసుకోవాలని జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి. నూకరాజు, ఉరికూటి రాజు డిమాండ్ చేశారు. ఆప్కాస్ లో పనిచేసి, రిటైర్ అయిన, మరణించిన వారి కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ... జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద యూనియన్ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ .... జివిఎంసి పారిశుధ్య విభాగం, నీటిపారుదల, యుజిడి, వెటర్నరీ, పార్కులు వంటి విభాగాలలో పనిచేస్తున్న ఆప్కాస్ కార్మికులలో చనిపోయిన, రిటైర్ అయిన వారి స్థానంలో, వారి కుటుంబ సభ్యులను పనిలోకి తీసుకోవాలన్నారు. వారందరికీ ఆప్కాస్ ద్వారా జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎం.వరప్రసాద్,జె.ఆర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు. పెద్ద ఎత్తున కార్మికులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.


## నూకాంబిక అమ్మవారి ఆలయం పునర్నిర్మాణ పనులు పూర్తి



**అనకాపల్లి, పతాకం న్యూస్:** స్థానిక నూకాంబిక అమ్మవారి ఆలయం పునర్నిర్మాణ పనులు పూర్తికావడంతో ప్రారంభానికి భారీఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. ఎనిమిదో తేదీన ఉదయం 10.58 గంటలకు శుభ ముహూర్తంగా వేదపండితులు నిర్ణయించారు. నూకాంబిక అమ్మవారి ప్రధాన ఆలయం పునఃప్రారంభం, రాజగోపురంపై కలశాల ప్రతిష్ఠ, మహాసంప్రోక్షణ, యజ్ఞయాగాదుల వంటి కార్యక్రమాల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ పీలా నాగశ్రీను, ఆలయ ఈవో యాళ్ల శ్రీధర్ తెలిపారు. ఆలయంతోపాటు రాజగోపురాన్ని వివిధ రకాల రంగులతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. సుమారు 100 అడుగుల ఎత్తున నిర్మించిన రాజగోపురంపై పలు దేవతామూర్తుల విగ్రహాలను తీర్చిదిద్దారు. మహాసంప్రోక్షణ, యజ్ఞం వంటి కార్యక్రమాల నిర్వహణ కోసం తాటాకు పందిళ్లతో యాగశాలను నిర్మించారు. ఆలయంతోపాటు ప్రాంగణం మొత్తం విద్యుద్దీపాలతో అలంకరిస్తున్నారు. కాగా ఆలయ పునర్నిర్మాణం కోసం సుమారు మూడేళ్ల నుంచి అమ్మవారి మూలవిరాట్‌కు పూజలు నిర్వహించడంలేదు. ఇప్పుడు ఆలయ నిర్మాణం పూర్తికావడంతో ఆదివారం ఉదయం అమ్మవారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం మధ్యాహ్నం రెండు గంటల నుంచి భక్తులకు దర్శనాలు కల్పిస్తారు. పునర్నిర్మితమైన నూకాంబిక అమ్మవారి ఆలయం ప్రారంభోత్సవం సందర్భంగా ఈ నెల ఐదో తేదీ నుంచి ఎనిమిదో తేదీ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

## ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో మూడు పశువులు మృతి

**గూడెంకొత్తవీధి, పతాకం న్యూస్:** చింతపల్లి-కృష్ణాదేవిపేట జాతీయ రహదారి రంపుల గ్రామంలో మూడు పశువులను రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో మూడు పశువులు అక్కడికక్కడే మృతి చెందగా, వాహనచోదకులకు స్వల్ప గాయాల య్యాయి. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి.



ఉదయం రంపుల గ్రామానికి చెందిన కంకిపాటి గోవింద్‌కి చెందిన రెండు ఆవులు, కంకిపాటి బాలకృష్ణ పడాల్‌కి చెందిన మరో ఆవు రహదారిపై వెళుతున్నాయి. అదే సమయంలో పెదవలస నుంచి రంపుల వైపు రెండు ద్విచక్ర వాహనాలపై ఇద్దరు వ్యక్తులు వెళుతున్నారు. ఈ క్రమంలో రెండు ద్విచక్ర వాహనాలు పశువులను ఢీకొనడంతో సంఘటన స్థలంలోనే మూడు పశువులు మృతి చెందాయి. స్వల్పంగా గాయపడిన వాహనచోదకులను స్థానికులు పెదవలస పీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు. విచ్చలవిడిగా విడిచిపెట్టడం వల్ల రహదారిపై సంచరిస్తున్నాయని, దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయని జీకేవీధి ఎస్‌ఐ సురేశ్ తెలిపారు.

## కంబాలకొండలో కాటేజీల నిర్మాణం



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** రిజర్వు ఫారెస్ట్ ప్రాంతంలో గల కంబాలకొండలో పర్యాటకులు రాత్రిపూట బస చేయడానికి వీలుగా కాటేజీలు నిర్మించాలని అటవీ శాఖ నిర్ణయించింది. దేశంలో అటవీ ప్రాంతాలను సందర్శించేవారి సంఖ్య ఏటేటా పెరుగుతుంది. కొందరు అక్కడే రాత్రిపూట బస చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. కర్ణాటకలో జంగిల్ రిసార్ట్స్, లాడ్జిలకు మంచి ఆదరణ లభిస్తోంది. అందుకోసం ఆ రాష్ట్రం ప్రత్యేకించి ఒక కార్పొరేషన్‌ను ఏర్పాటుచేసింది. ఇదే బాటలో పలు రాష్ట్రాలు అటవీ పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మన రాష్ట్రంలో పర్యాటకుల కోసం అడవుల్లో ప్రత్యేకించి సదుపాయాలు కల్పించాలని అటవీ శాఖకు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సూచించారు. దీంతో కంబాలకొండలో రాత్రి పూట పర్యాటకులు గడిపేందుకు అనువుగా నాలుగైదు కాటేజీలు నిర్మించాలని ప్రతిపాదించారు.నగరానికి ఆనుకుని విస్తరించిన సుమారు 15 వేల ఎకరాల రిజర్వు ఫారెస్టులో కంబాలకొండ ఎకో టూరిజం పార్కు ఉంది. రిజర్వు ఫారెస్టులో ఒకప్పుడు పలు రకాల జంతువులు ఉండేవి. చిరుతపులులు కూడా సంచరించేవి. అయితే నగరీకరణ పెరగడంతో చిరుతలు దాదాపు అంతరించిపోయాయి. జింకలు మాత్రం వందల సంఖ్యలో ఉన్నాయి. ప్రస్తుతం కంబాలకొండకు ఉదయం నుంచి సాయంత్రం వరకూ మాత్రమే సందర్శకులను అనుమతిస్తున్నారు. ఇటీవల సుమారు రూ.1.5 కోట్లతో గెస్ట్ హౌస్, యాంపీ థియేటర్, యోగా, మెడిటేషన్ హాలు, వ్యూ పాయింట్ నిర్మించారు. చెరువులో బోటింగ్ సదుపాయం కల్పించారు. ఇకపై రాత్రి బస చేసేలా గెస్ట్ హౌస్‌కు అదనంగా నాలుగైదు కాటేజీలు నిర్మించాలని అధికారులు ప్రతిపాదించారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, రక్షణ ఏర్పాట్లు, రెస్టారెంట్ సౌకర్యం వంటివి ఉంటాయి. ఒక్కొక్క కాటేజీకి రూ.15 లక్షలు ఖర్చవుతుందని అంచనా వేస్తున్నారు. అయితే పూర్తిస్థాయిలో ప్రతిపాదనలు సిద్ధం చేసిన తరువాత ఒక అంచనాకు రావచ్చునని అధికారులు వివరించారు.

## వెంకటాపురం జంక్షన్- కొత్తూరు మధ్య ఛిద్రమైన రహదారి



**రాంబిల్లి, పతాకం న్యూస్:** అచ్యుతాపురం నుంచి ఎలమంచిలి వెళ్లే ప్రధాన రహదారిలో రాంబిల్లి మండల పరిధిలోని వెంకటాపురం జంక్షన్ నుంచి కొత్తూరు వరకు సుమారు మూడు కిలోమీటర్ల మేర పలుచోట్ల భారీ గోతులు ఏర్పడ్డాయి. అచ్యుతాపురం సెజ్, పరవాడ మండలంలోని ఫార్మాసిటీ, ఇతర పరిశ్రమలు, రాంబిల్లి మండలంలోని ఎన్ఏవోబీకి వివిధ రకాల వస్తుసామగ్రితో తుని వైపు నుంచి వచ్చే భారీ వాహనాలు ఎలమంచిలి నుంచి ఈ మార్గంలోనే వస్తుంటాయి. దీంతో నిత్యం వేలాది వాహనాల రాకపోకలతో ఈ రోడ్డు రద్దీగా వుంటున్నంది. అయితే ఆర్అండ్‌బీ పరిధిలోని ఈ రహదారి నిర్వహణ పనులను అధికారులు ఏడాది నుంచి చేపట్టకపోవడంతో గోతులు నానాటికీ పెద్దవి అవుతున్నాయని వాహనదారులు ఆరోపిస్తున్నారు. పలుచోట్ల రోడ్డు మొత్తం ఛిద్రమైంది. కొన్నిచోట్ల రహదారి మధ్యలో గోతులు వున్నాయి. వీటిని తప్పించే క్రమంలో వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. రాత్రిపూట దగ్గరకు వచ్చే వరకు గోతులు కనిపించకపోవడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు.

## సాగునీటి పనులు వేగవంతం చేయాలి



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** మెళియాపుట్టి మండలంలో జరుగుతున్న సాగునీటి పనులను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కకర్ పరిశీలించారు. కొసమాల వద్ద మహేంద్ర తనయ నదిపై ఎత్తిపోతల పథకం నిర్మాణం చేపట్టనున్న స్థలంతో పాటు ఆఫ్‌షోర్ రిజర్వాయర్ ప నులను కలెక్టర్ పరిశీలించారు. అలాగే చాపర వద్ద జరుగుతున్న ఆఫ్‌షోర్ జిరో లెవెల్ వద్ద జరుగు తున్న ఆనకట్టు పనులు, అచ్చానాపురం వద్ద జరుగుతున్న కాలువ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులకు అ ధిక ప్రాధాన్యం ఇస్తుందని, అందువల్ల పనుల్లో వేగవంతం పెంచాలని అ న్నారు. మెట్ట భూములకు సాగునీరు అందించేందు కు చర్యలు తీసుకుంటు న్నట్టు తెలిపారు. ఎత్తి పోతల పథకం పనులు త్వరితగతిన చేపట్టి సాగు నీరు అందించాలని ఆ గ్రామ రైతులు కోరుతూ వినతి పత్రం అందజేశా రు. తహసీల్దార్ బి.పాపరావు, ఇంజనీరింగ్ అధికా రులు, కూటమి నేతలు తదితరులు ఉన్నారు.

# అరకులోయలో అగ్నిప్రమాదం.. గిరిజన రైతు కాఫీ తోట దగ్ధం



**అల్లూరి జిల్లా, పతాకం న్యూస్:** అల్లూరి జిల్లాలోని బస్కి పంచాయతీ కంజరి తోటలో అగ్నిప్రమాదం జరిగింది. ఓ గిరిజన రైతుకు సంబంధించిన కాఫీ తోట దగ్ధమైంది. ఈ ఘటనలో జి. అప్పలనాయుడుకి చెందిన సుమారు 2 ఎకరాల కాఫీ తోట మంటల్లో కాలిపోయింది. ఈ అగ్నిప్రమాదంలో కాఫీతో పాటు మిరియాల పంట కూడా పూర్తిగా కాలిపోయింది. గ్రామస్తులు సకాలంలో స్పందించి మిగిలిన తోటలకు మంటలు వ్యాపించకుండా చర్యలు చేపట్టారు. అయితే, స్థానిక అధికారులు కూడా ఇప్పటికే ఆ ప్రాంతానికి వెళ్లి మిగిలిన తోటలను రక్షించడానికి చర్యలు చేపట్టారు. ఈ ఘటనలో రైతుకు దాదాపు రూ.5 లక్షల పంట నష్టం జరిగినట్లు అంచనా వేస్తున్నారు. ఏళ్ల తరబడి కష్టపడి పెంచుకున్న తోటలు కళ్లముందే బూడిదవ్వడంతో రైతు అప్పలనాయుడు కుటుంబం కన్నీరుమున్నీరవుతోంది. ఏపీ ప్రభుత్వం స్పందించి బాధిత రైతుకు తక్షణ పరిహారం అందించి ఆదుకోవాలని స్థానికులు, రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. పర్యాటక ప్రాంతమైన అరకులోయలో ఇలాంటి ఘటనలు జరగడం రైతులకు తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. అగ్నిప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి బాధితులకు న్యాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

## ఉద్యాన పంటల సాగుపై దృష్టి సారించాలి: కలెక్టర్



**భోగాపురం, పతాకం న్యూస్:** నిత్యం ఆదాయం వచ్చే ఉద్యాన పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని కలెక్టర్ రామసుందర్‌రెడ్డి సూచించారు. మండలంలోని కొయ్యపేటలో రైతులు సాగు చేస్తున్న పూలతోటలు, ఉద్యాన పంటలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరి స్థానంలో పూల తోటలు, కూరగాయలు, ఆకు కూరలు, పండ్ల తోటలను సాగు చేసి ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. ఉద్యాన పంటలు సాగుచేసే రైతులకు జిల్లా యంత్రాంగం సహాయ సహకారాలు, ప్రోత్సాహం అందిస్తుందన్నారు. మార్కెట్ సదుపాయం కల్పిస్తామని, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తామని అన్నారు. అధిక దిగుబడులు సాధించేందుకు ఆధునిక విధానాలను అవలంభించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవనశాఖ డీడీ చిట్టిబాబు, వ్యవసాయ శాఖ ఏడీ నాగభూషణరావు, మండల వ్యవసాయ అధికారి హైమావతి, ఉద్యాన అధికారి ఉమాభరణి, కార్యదర్శి జయమ్మ, ఏఈవో వెంకటరావు, వీఏఏ శ్రావణి, వీహెచ్ఏ చందన, రైతులు బంగార్రాజు, తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి స్వాధీనం.. ఇద్దరి అరెస్టు



**రామభద్రపురం, పతాకం న్యూస్:** మండల కేంద్రంలో చర్చి సెంటర్ వద్ద గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశామని బొబ్బిలి రూరల్ సీఐ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. వారి నుంచి సుమారు రెండున్నర కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడారు. ఒడిశా రాష్ట్రం నుంచి బస్సులో గరివిడి మండలం బాగువలస గ్రామానికి చెందిన గొండేల దిలీప్, చీపురుపల్లి కుమ్మరి కాలనీకి చెందిన నడిమింటి అఖిల్ తీసుకు వచ్చారన్నారు. రామభద్ర పురం నుంచి చీపురుపల్లి ఆటో వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న సమయంలో పట్టుకు న్నామన్నారు. వారి నుంచి రెండున్నర కిలోల గంజాయిని స్వాధీనం చేసుకు న్నామన్నారు. గతంలో 11 మందిని అరెస్టు చేసి 21 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. అప్పట్లో వీరిద్దరు తప్పిం చుకున్నారన్నారు. అంతేకాకుండా గొండేల దిలీప్‌కుమార్‌పై పెదమానాపురం పోలీసు స్టేషన్‌లో ఒక కేసు నమోదై ఉందన్నారు. సమావేశంలో ఎస్ఐ వెలమ ల ప్రసాదరావు, ఏఎస్ఐ ఆర్.అప్పారావు, కానిస్టేబుల్ సురేంద్ర పాల్గొన్నారు.

## జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ కిషోర్ మాక్వానాకు అస్వస్థత.. ఆస్పత్రికి తరలింపు



**రాజమహేంద్రవరం, పతాకం న్యూస్:** జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ కిషోర్ మాక్వానా శనివారం రాజమండ్రిలో విస్తృతంగా పర్యటించారు. ఈ పర్యటనలో కిషోర్ మాక్వానా.. స్వల్ప అస్వస్థతకు గురికావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. రాజమండ్రిలోని ఓఎన్జీసీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, ఓఎన్జీసీ అధికారులతో కలిసి ఆయన పాల్గొన్నారు. సమావేశం జరుగుతున్న సమయంలోనే కిషోర్ మాక్వానా అస్వస్థతకు గురయ్యారు. ఈ సమావేశంలో ఉండగానే ఆయనకు వాంతులు కావడంతో వెంటనే అధికారులు స్పందించి సమీపంలోని డెల్టా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షలు నిర్వహించగా ప్రస్తుతం ఆయన ఆరోగ్యం క్రమంగా మెరుగుపడుతున్నట్లు సమాచారం. అధికారులు వెంటనే స్పందించడంతో ఎలాంటి ప్రమాదం జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో కిషోర్ మాక్వానా చికిత్స పొందుతున్నారు.

## ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలి



**కడప, పతాకం న్యూస్:** ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలని ఆర్టీసీ కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్టీపీ రాఘవ కుమార్ సూచించారు. పత్తికొండ ఆర్టీసీ డిపోను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. డిపోలోని అన్ని విభాగాలను పరిశీలించారు. డిపో ఆవరణంలో సిబ్బందితో కలసి మొక్కలు నాటారు. ఈడీ మాట్లాడుతూ బస్సుల సామర్థ్యాన్ని ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. అనంతరం పత్తికొండ ఆర్టీసీ బస్టాండ్‌ను ఆయన పరిశీలించారు. కర్నూలు డీపీటీవో శ్రీనివాసులు, ఇన్‌చార్జి డీఎం నాగభూపాల్, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఎస్ఎస్ రెడ్డి, జీఎస్ వాసు, ఈవీఎం రాజు, లక్ష్మన్న, ఎం.జయన్న ఉన్నారు.

## 15లోగా పనులు పూర్తి చేయండి



**విజయనగరం, పతాకం న్యూస్:** సీతానగరం మండలంలో అధివృద్ధి పనులను ఈ నెల 15వ తేదీలోపు పూర్తి చేయాలని డ్వామా పీడీ కె.రామచంద్రరావు ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల అధికారులు, ఇంజనీరింగ్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పనులు పూర్తి చేయడ మే కాకుండా పూర్తయిన ప్రతి పనికి 15 లోపు బిల్లులు అప్‌లోడ్ పూర్తి చేయాలన్నారు. మండలంలో 184 సీసీ రోడ్లు, బీటీ రోడ్లు మంజూరు కాగా కేవలం 75 పనులు మాత్రమే వివిధ స్థాయిల్లో ఉన్నాయన్నారు. మిగిలిన వాటిని కూడా ప్రారంభించి పూర్తి చేయాలని ఆదేశించారు. అందుకు సంబం? దించిన ఎం.బుక్ రికార్డింగ్ రెడీ చేసి ఎంపీడీవోకు సమర్పించాలని ఆదేశించారు. సమావేశం లో ఏపీడీ శ్రీహరి, ఎంపీడీవో ఎంఎల్ఎన్ ప్రసాద్, మండల ఇంజనీరింగ్ అధికారి చంద్రమౌళి, ఏపీవో బాలకృష్ణ, జేఈ సోమేశ్వరరావు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## వైద్య సేవలు సక్రమంగా అందించాలి



**విజయనగరం, పతాకం న్యూస్:** పట్టణ, గ్రా మీణ ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవలు సక్రమంగా అం దించాలని, అవుట్ పేషెంట్ల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎస్.రాంసుం దర్‌రెడ్డి వైద్యాధికారులకు ఆదేశించారు. స్థానిక కలెక్టర్ కార్యా లయ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి వైద్య ఆరోగ్య శాఖపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పీహెచ్‌సీల ద్వా రా ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను విస్తృతం చే యాలన్నారు. ప్రతి ఆరోగ్య కేంద్రంలో నెలకు కనీసం 1500 మందికి సేవలు అందించాల్సి ఉండగా, చాలా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 50శాతం మందికి కూడా సేవలు అందజేయకపోవటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్‌సీడీ స్క్రీనింగ్ శత శాతం పూర్తి చేయా లన్నారు. పీహెచ్‌సీల్లో గర్భిణులకు డెలివరీలు తప్పని సరిగా చేయాలని, ప్రభుత్వ ఆసుపత్రులలో డెలివరీ చేయించుకున్న వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ప్రోత్సాహకాలపై ప్రచారం చేయాలని తెలిపారు. మాతృత్వ, శిశు మరణాలు సంభవించకుం డా ముందస్తు చర్యలు తీసుకోవాలని, హైరిస్కు గల కేసులను నిరంతరం పర్యవేక్షించాలని, డెలివరీ తేదీకి ముందుగానే ఆసుపత్రిలో చేర్పించాలని ఆదేశించారు. డయేరియా కేసులు వస్తే సంబంధిత ఎంపీడీవోకు వెంటనే సమాచారం అందజేసి, అప్రమత్తం చేయాల న్నారు. ఆ గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని, డయేరియా రావడానికి గల కారణాలను తెలుసుకుని అధికారులు సమన్వయంతో పనిచేసి, వెంటనే నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో డీఎంహెచ్ వో ఎస్.జీవనరాణి, వైద్యాధికారులు పాల్గొన్నారు.

## కృష్ణానదిలో మునిగి బీటెక్ విద్యార్థి మృతి



**తుళ్లూరు, పతాకం న్యూస్:** స్నేహితులతో కలిసి కృష్ణానదిలో స్నానానికి దిగిన బీటెక్ విద్యార్థి ప్రమాదవశాత్తు మునిగి మృత్యువాత పడ్డాడు. వినుకొండకు చెందిన బీటెక్ విద్యార్థి గర్రె వెంకట ఈశ్వర్ సాత్విక్ (21) మందడంలోని రామ్స్ పీజీ హాస్టల్‌లో ఉంటూ విట్ యూనివర్సిటీలో బీటెక్ (సీఎస్ఈ) 4వ సంవత్సరం చదువుతున్నాడు. శుక్రవారం తొమ్మిది మంది స్నేహితులు కలిసి రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరు మండలం రాయపూడి లాంచీ రేవు వద్ద స్నానానికి వెళ్లారు. ఈ క్రమంలో వెంకట ఈశ్వర్ సాత్విక్ నదిలో గల్లంతవగా మిగతా వారు పెద్దగా కేకలు పెట్టారు. గమనించిన సమీపంలోని మత్స్యకారులు అక్కడికి చేరుకుని గాలించి కొద్దిసేపటికి మృతదేహాన్ని వెలికి తీశారు. పోలీసులు ఘటనా స్థలిని పరిశీలించి విచారణ చేపట్టారు.

## 22న జిల్లా బాడీ బిల్డర్స్ పోటీలు




**విజయనగరం, పతాకం న్యూస్:** మహా బలుడు కోడి రామమూర్తి స్ఫూర్తిని యువతలో కలిగించేందుకు విజయనగరం జిల్లా బాడీ బిల్డర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మార్చి 22న ఉమ్మడి విజయనగరం జిల్లా బాడీ బిల్డర్స్ పోటీలు నిర్వహిస్తున్నామని ఇందులో బాడీ బిల్డర్స్ పాల్గొని జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షులు రెడ్డి శంకరరావు పిలుపునిచ్చారు. విజయనగరం బాడీ ఫిట్నెస్ జిమ్ లో జరిగిన విలేకర్ల సమావేశంలో జిల్లా కార్యదర్శి కోరాడశ్రీనివాసరావుతో కలిపి మాట్లాడారు. 55కేజీలు నుండి 75 కేజీలు ల్లో 6 కేటగిరీలు వారీగా నిర్వహించడం జరుగుతుందన్నారు. వారందరికీ సర్టిఫికెట్,ప్రైజ్ ఇవ్వడం జరిగుతుందని అన్నారు. ప్రముఖులు చేతులు మీదుగా మిస్టర్ విజయనగరం ప్రైజ్ ఇవ్వడం జరుగుతుంది అన్నారు. రాత్రి భోజన సౌకర్యం ఏర్పాటు చేస్థాం అని అన్నారు. యువత ని డ్రగ్స్, మత్తు పదర్థాలు కి దూరంగా ఉంచేందుకు బాడీ బిల్డర్స్ అసోసియేషన్ ఈ పోటీలు నిర్వహించడం జరుపు తున్నాం అని అన్నారు. కవిజయనగరంలో గురజాడ కళాభారతి ఆడిటోరియంలో జరగనున్న ఈ పోటీలు ల్లో ఉమ్మడి విజయనగరం జిల్లా లో యువకులు,బాడీ బిల్డర్స్ పాల్గొనాలని పిలుపునిచ్చారు. విలేకర్ల సమావేశంలో లో ఉపాధ్యక్షులు నమ్మి ప్రసాద్, జాయింట్ సెక్రటరీ అజరు, అసిస్టెంట్ సెక్రటరీ డి. సన్నిబాబు, ఎల్. శ్రీనువాసరావు పాల్గొన్నారు.

## దుర్గమ్మను దర్శించుకున్న హోం మంత్రి అనిత



**విజయవాడ, పతాకం న్యూస్:** మహా కుంభాభిషేకం సందర్భంగా విజయవాడ కనకదుర్గమ్మను హోంమంత్రి వంగలపూడి అనిత, మంత్రి అచ్చెన్నాయుడు శనివారం దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన మంత్రులకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు దేవస్థానం అధికారులు. అమ్మవారి దర్శనానంతరం కంచి కామకోటి పీఠాధిపతులను హోం మంత్రి అనిత కలిశారు. అనంతరం హోంమంత్రి అనిత మాట్లాడుతూ.. అమ్మవారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. అమ్మవారిని ఎన్నిసార్లు దర్శించుకున్నా తనివి తీరదని తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటలకు మహా కుంభాభిషేకం ప్రారంభమవుతుందని చెప్పారు. ఈరోజు, రేపు అంతరాలయ దర్శనం నిలిపివేస్తారని అన్నారు. ప్రతి 12 ఏళ్లకు వచ్చే ఈ మహా కుంభాభిషేకం మహోత్సవాన్ని వీక్షించేందుకు రేపు లక్ష మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నామని తెలిపారు. ఈ మహోత్సవానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేశామని హోంమంత్రి అనిత పేర్కొన్నారు. ఇంద్రకీలాద్రిపై మహా కుంభాభిషేక మహోత్సవాలు రెండోరోజుకు చేరుకున్నాయి. ఆదివారం ఉదయం 9:34 గంటలకు ప్రధాన ఘట్టమైన కుంభాభిషేకం జరుగనుంది. మహోత్సవాల్లో భాగంగా కంచి పీఠాధిపతి శంకర జయేంద్ర సరస్వతి కృష్ణా నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు.

## తాగునీటి నాణ్యతపై రాజీ పడొద్దు



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** తాగునీటి నాణ్యత విషయంలో రాజీ పడవద్దని, స్వచ్ఛమైన నీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అన్నారు. నగరంలోని తాగునీటి సరఫరా పంప్ హౌస్‌లను ఆయన అసిస్టెంట్ కలెక్టర్ డి.పృథ్వీరాజ్ కుమార్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీచేశారు. ఏఎస్ఎన్ కాలనీలోని పంప్ హౌస్, ఆదివారం పేట వాటర్ వర్క్స్ ప్లాంట్‌ను పరిశీలించారు. బలగలోని హెడ్ వాటర్ వర్క్స్ విభాగాన్ని తనిఖీ చేసి నీటి శుద్ధీకరణ ప్రక్రి యను, క్లోరినేషన్ స్థాయిలను తనిఖీ చేశారు. రామలక్ష్మణ జంక్షన్, ప్రభాకర్ నగర్ వీధుల్లో పర్యటించి పారిశుధ్య పనులపై సిబ్బందికి సూచ నలిచ్చారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరిం చారు. పైపులైన్ల లీకేజీలను తక్షణమే అరికట్టాలని ఆదేశించారు.

## వంట గ్యాస్‌పై వాత.. డొమెస్టిక్ సిలిండర్‌పై రూ. 60 పెంపు



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** సామాన్య, మధ్యతరగతి ప్రజలపై మరోసారి ధరల భారం పడింది. దేశీయ చమురు మార్కెటింగ్ కంపెనీలు గ్యాస్ సిలిండర్ల ధరలను భారీగా పెంచుతూ నిర్ణయం తీసుకున్నాయి. గృహ వినియోగ (డొమెస్టిక్), వాణిజ్య (కమర్షియల్) సిలిండర్ల ధరలను పెంచుతున్నట్లు ప్రకటించాయి. పెరిగిన ఈ ధరలు శనివారం నుంచే దేశవ్యాప్తంగా అమలులోకి వచ్చాయి. తాజా పెంపుతో 14.2 కిలోల డొమెస్టిక్ సిలిండర్‌పై రూ. 60 పెరిగింది. దీంతో ఢిల్లీలో సిలిండర్ ధర రూ. 853 నుంచి రూ. 913కి చేరింది. సుమారు 11 నెలలుగా స్థిరంగా ఉన్న వంట గ్యాస్ ధర ఇప్పుడు పెరగడం గమనార్హం. అయితే, ప్రధానమంత్రి ఉజ్వల యోజన లబ్ధిదారులకు ఈ ధరల పెంపు నుంచి మినహాయింపు ఇచ్చారు. వారికి పాత ధరలే వర్తిస్తాయని కేంద్రం స్పష్టం చేసింది. మరోవైపు, హోటళ్లు, రెస్టారెంట్లలో వినియోగించే 19 కిలోల కమర్షియల్ సిలిండర్ ధరను ఏకంగా రూ. 115 మేర పెంచారు. ఫలితంగా ఢిల్లీలో దీని ధర రూ. 1,883కి చేరింది. ఈ పెంపు ప్రభావంతో బయట ఆహార పదార్థాల ధరలు కూడా పెరిగే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. పశ్చిమాసియాలో ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య నెలకొన్న యుద్ధ వాతావరణం కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు పెరిగాయి. ఈ ప్రభావమే దేశీయ గ్యాస్ ధరల పెంపునకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. భారత్ తన ఇంధన అవసరాల్లో దాదాపు 90 శాతం దిగుమతులపైనే ఆధారపడటంతో, అంతర్జాతీయ పరిణామాలు దేశీయ ధరలపై నేరుగా ప్రభావం చూపుతున్నాయి.

## జీరామ్‌జీతో పనిదినాలు పెరగడం అబద్ధం: షర్మిల



**గుడివాడ, పతాకం న్యూస్:** కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన వీబీ-జీరామ్‌జీ చట్టం ద్వారా 125 రోజుల పనిదినాల కల్పన ఉత్త అబద్ధమని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఆరోపించారు. ఈ చట్టంతో గ్రామస్వరాజ్యం నాశనమవుతుందన్నారు. కృష్ణా జిల్లా అవనిగడ్డ, గుడ్లవల్లేరు మండలం కౌతవరం గ్రామాల్లో ఆమె ఉపాధి హామీ చట్టం-పరిరక్షణ యాత్ర చేపట్టి ప్రజల నుద్దేశించి మాట్లాడారు. కాంగ్రెస్ తెచ్చిన ఉపాధి హామీ చట్టంతో గ్రామసభలు నిర్వహించి, గ్రామానికి ఏం పనులు కావాలో గుర్తించేవారన్నారు. దాన్ని రద్దు చేసి, బీజేపీ తెచ్చిన కొత్త చట్టంతో పనిదినాలు తగ్గిపోనున్నాయని, వలసలు పెరిగే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. పాత చట్టాన్ని పునరుద్ధరించాలని ఆమె డిమాండ్ చేశారు.

## ఇకపై పొరపాట్లు జరగవు..

### మీడియా సమావేశంలో ఎమ్మెల్యే కొలికపూడి



**ఎన్టీఆర్ జిల్లా, పతాకం న్యూస్:** ఎన్టీఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గంలో గత కొంతకాలంగా టీడీపీలో సాగుతున్న రాజకీయ వివాదాలకు తెరపడినట్లు కనిపిస్తోంది. ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, ఎంపీ కేశినేని చిన్ని మధ్య నెలకొన్న విభేదాల నేపథ్యంలో, అసెంబ్లీ లాబీల్లో ఏపీ టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుని కొలికపూడి కలిశారు. నియోజకవర్గంలో చోటుచేసుకున్న తాజా పరిణామాలు, పార్టీ ప్రతిష్ఠపై పడుతున్న ప్రభావంపై వీరు చర్చించారు. అనంతరం మీడియాతో పల్లా మాట్లాడుతూ కొలికపూడికి తాను చెప్పాల్సింది చెప్పానని అన్నారు. అనంతరం కొలికపూడి మాట్లాడుతూ... గతంలో జరిగిన పొరపాట్లు ఇకపై పునరావృతం కావని, 'గతం గతః' అని ఆయన స్పష్టం చేశారు. తన చర్యల వల్ల పార్టీకి ఇబ్బంది కలిగినందుకు విచారం వ్యక్తం చేస్తూ, భవిష్యత్తులో నియోజకవర్గ ఎంపీకి ఇవ్వాల్సిన గౌరవం ఇస్తానని, ఆయన నుంచి కూడా అదే ఆశిస్తానని తెలిపారు. అలాగే, తన చుట్టూ ఉన్న కొందరు వ్యక్తుల వల్ల లేదా ఎంపీ అనుచరులు కొందరి వల్ల ఈ సమస్యలు తలెత్తి ఉండవచ్చని అభిప్రాయపడ్డారు. రాజకీయ ప్రయోజనాల కోసం కులం కార్డును వాడటం తన అభిమతం కాదని, ఆ విధానానికి తాను పూర్తిగా వ్యతిరేకమని కొలికపూడి స్పష్టం చేశారు. ఇకపై నియోజకవర్గంలో ఎలాంటి సమస్యలు తలెత్తినా నేరుగా జోనల్ కోఆర్డినేటర్ లేదా జిల్లా పార్టీ అధ్యక్షుడి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకుంటానని హామీ ఇచ్చారు.

# పట్టణాలకు ముప్పు 'అర్బన్ ఛాలెంజ్ ఫండ్'!



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** కేంద్ర బిజెపి ప్రభుత్వం పట్టణాల్లో మంచినీరు, మురుగు నీరు, పారిశుధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, ఇతర మౌలిక సదుపాయాలు పెంపొందించేందుకు, పట్టణాలను ఆర్థిక వృద్ధికి చోదక శక్తులుగా, సృజనాత్మక పునరాభివృద్ధి కేంద్రాలుగా నిర్మించడం పేర అర్బన్ ఛాలెంజ్ ఫండ్ (యు.సి.ఎఫ్) పథకాన్ని ప్రకటించింది. 2026 నుండి 2031 వరకు ఐదేళ్ల పాటు ఈ పథకం అమలులో ఉంటుంది. ఈ పథకాన్ని ప్రపంచ బ్యాంకు అనుబంధ సంస్థ అయిన ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఎ.డి.బి) రూపొందించింది. వాస్తవంగా దీనిని 2025-26 బడ్జెట్‌లోనే ప్రవేశ పెట్టారు. ఎ.డి.బి రుణాన్ని మంజూరు చేయకపోవడంతో అమల్లోకి రాలేదు. 2026-27 బడ్జెట్‌లో తిరిగి ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ఈ పథకానికి దశల వారీగా రాబోయే ఐదేళ్లలో రూ.లక్ష కోట్లు కేంద్ర ప్రభుత్వానికి ఎ.డి.బి రుణం రూపంలో ఇస్తుంది. దీని అమలును కూడా ఎ.డి.బి ప్రత్యక్షంగా పర్యవేక్షణ చేస్తుంది. దేశ పట్టణ జనాభా 2036 నాటికి 40 శాతానికి చేరుతుందని, స్థూల జాతీయోత్పత్తిలో 70 శాతానికి పట్టణాలు, నగరాలు ప్రాతినిధ్యం వహిస్తాయని, రాబోయే 15 ఏళ్లలో దేశంలో పట్టణాలు, నగరాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కనీసం రూ.75 లక్షల కోట్లు (840 బిలియన్ డాలర్లు) పెట్టుబడులు అవసరమని ప్రపంచబ్యాంకు భారతదేశ పట్టణ మౌలిక సదుపాయాలపై 2022లో విడుదల చేసిన నివేదిక తెలిపిందని తాజాగా విడుదల చేసిన 2025-26 ఆర్థిక సర్వే పేర్కొన్నది. అంటే ఏడాదికి సుమారు రూ.4.5 లక్షల కోట్లు పెట్టుబడులు పెట్టాలని, ఇది స్థూల జాతీయ ఉత్పత్తి (జి.డి.పి)లో 1.2 శాతంగా ఉంటుందని, ఇంత పెట్టుబడి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టలేవని, ప్రైవేట్ మార్కెట్ ఫైనాన్స్ నుండి సమీకరించుకోవాలని మోడీ ప్రభుత్వం చెబుతున్నది.ఇప్పుడు యు.సి.ఎఫ్ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం పట్టణ స్థానిక సంస్థలకు మౌలిక సదుపాయాల కల్పనకు ఇచ్చే గ్రాంట్ల నుండి వైదొలగి బహిరంగ మార్కెట్ నుండి రుణాల ద్వారా నిధులు సేకరించుకొని మౌలిక సదుపాయాలు చేపట్టాలని ఆదేశిస్తున్నది. ఈ పథకం పెద్ద పెద్ద నగరాలకే పరిమితం కాదు. దేశంలో ఉన్న అన్ని నగరాలతో పాటు మొత్తం 4,223 టైర్ 1, టైర్ 2 పట్టణాలకు కూడా ఈ పథకాన్ని వర్తింపజేశారు. చిన్న చిన్న పట్టణాలకు ప్రత్యేకంగా ప్రైవేట్ మార్కెట్ నుండి రుణాలు సేకరించుకోవటానికి కేంద్ర ప్రభుత్వం ఈ పథకంలో ప్రత్యేకంగా మార్కెట్ సంస్థలకు రిస్క్ హామీగా రూ.5 వేల కోట్ల రుణ హామీ నిధిని కూడా ఏర్పాటు చేస్తున్నది. పట్టణ ఛాలెంజ్ నిధి మొత్తం రూ.4 లక్షల కోట్లుగా నిర్ణయించారు. రాబోయే ఐదేళ్లలో పట్టణాల్లో ఖర్చు పెట్టాలి. ఈ మొత్తం నిధిని కేంద్ర ప్రభుత్వం ఇవ్వదు. ఇందులో కేవలం 25 శాతం (రూ.లక్ష కోట్లు) మాత్రమే ఇస్తుంది. మిగిలిన రూ.మూడు లక్షల కోట్ల నిధులు సమకూర్చు కోవటానికి కొన్ని షరతులు విధించింది. రూ.4 లక్షల కోట్లలో కనీసం 50 శాతం నిధులను ప్రైవేట్ రుణాల ద్వారా, మున్సిపల్ బాండ్లు, ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం (పిపిపి) రూపంలో సమకూర్చుకోవాలి. మిగిలిన 25 శాతం అనగా రూ.లక్ష కోట్లు రాష్ట్ర ప్రభుత్వం, పట్టణ స్థానిక సంస్థలు భరించాలి లేదా వీటిని కూడా రుణాలు, బాండ్ల రూపంలో సమకూర్చుకోవాలి. ఈ పథకంలో మౌలిక సదుపాయాలను తప్పనిసరిగా ప్రభుత్వ, ప్రైవేట్, భాగస్వామ్యంలో చేపట్టాలి. గత రెండున్నర దశాబ్దాల నుండి ప్రపంచబ్యాంక్ ఆదేశిత సంస్కరణలు పట్టణ రంగంలో తీసుకురావటానికి ప్రయత్నం చేస్తున్నప్పటికీ, ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వం పట్టణ రంగంలో అమలు చేసిన వివిధ పథకాలకు తప్పనిసరిగా ప్రైవేటు రుణం తీసుకోవాలని, కార్పొరేట్ బాండ్లు సేకరించాలని, పిపిపి కింద ప్రాజెక్టులు చేపట్టాలని షరతులు లేవు. 2005-12 మధ్య అమలు చేసిన జవహర్‌లాల్ నెహ్రూ పట్టణ ఆధునీకరణ మిషన్ (జె.ఎన్.ఎన్.యు.ఆర్.ఎం) గాని, 2015-25 మధ్య అమలు చేసిన స్మార్ట్ సిటీ పథకంలో గానీ ఈ నిబంధనలు తప్పనిసరి చేయలేదు. జె.ఎన్.ఎన్.యు.ఆర్.ఎంలో కేంద్రం 70 శాతం, రాష్ట్రాలు, పట్టణ స్థానిక సంస్థలు 30 శాతంగాను, స్మార్ట్ సిటీ పథకంలో కేంద్రం 50 శాతం, రాష్ట్రాలు 50 శాతం నిధులు భరించేలా రూపొందించి అమలు చేశాయి. అయితే ఇవి కూడా సంస్కరణతో ముడిపెట్టి అమలు చేసినవే. దేశంలో నేటికి పెద్దపెద్ద మెట్రోపాలిటిన్ నగరాలు మాత్రమే ప్రభుత్వ బ్యాంకుల నుండి పరిమిత స్థాయిలోనే రుణాలు, మున్సిపల్ బాండ్ల రూపంలో నిధులు సేకరిస్తున్నాయి. ఇప్పటివరకు మున్సిపల్ బాండ్ల రూపంలో దేశంలో 10 నగరాలు మాత్రమే రుణాలు సేకరించాయి. 2018లో రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు ప్రభుత్వం కూడా అమరావతి బాండ్స్ పేర రెండు వేల కోట్లు రుణం సమీకరించింది. ఈ రుణాలు మొత్తం కూడా రూ.3,783 కోట్లు మాత్రమే. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం ఈ పథకం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పట్టణ స్థానిక సంస్థలు నిధుల కోసం ఆధారపడకుండా మార్కెట్ రుణాలు, మున్సిపల్ బాండ్ల రూపంలో సేకరించుకోవాలని షరతులు విధించింది. అలా సేకరించుకుంటేనే కేంద్ర ప్రభుత్వం ప్రాజెక్ట్ వ్యయంలో 25 శాతం గ్రాంట్ ఇస్తుంది. ఈ బాండ్లను కూడా బడా కార్పొరేట్ సంస్థల నుండి సేకరించే నగర పాలక సంస్థలకు నగదు ప్రోత్సాహకాలు కూడా ప్రకటించింది. ఉదాహరణకు ఏదైనా నగర పాలక సంస్థ రూ.1000 కోట్ల విలువగల ఒకే మున్సిపల్ బాండ్‌ను కార్పొరేట్ సంస్థల నుండి సేకరిస్తే ఆ నగర పాలక సంస్థకు రూ.100 కోట్ల ప్రోత్సాహక నిధిని ఇస్తామని తెలిపింది. దేశంలోని పట్టణాలన్నింటినీ మౌలిక సదుపాయాల నిధుల కోసం రుణాల వేటకు ప్రభుత్వం బలవంతంగా నెడుతున్నది. ముఖ్యంగా కార్పొరేట్ సంస్థల నుండి బాండ్ల రుణాలు సేకరించాలంటే నగరాలు, పట్టణాలు అన్ని భారత స్టాక్ ఎక్స్ఛేంజ్ బోర్డు (సెబీ)లో నమోదు కావాలి. కంపెనీల వలే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో లిస్ట్ కూడా కావాలి. అలాగే నగరాలు, పట్టణాలు ఎంతెంత రుణ సామర్థ్యం కలిగి ఉన్నాయో ప్రతి ఏడాది క్రిసిల్, కౌర్, ఫిచ్, స్మేరా వంటి రేటింగ్ సంస్థల నుండి క్రెడిట్ రేటింగ్ ర్యాంకులు పొందాలి. క్రెడిట్ యోగ్యత కలిగిన రేటింగ్ ర్యాంకులు పొందాలంటే పట్టణ స్థానిక సంస్థలు పౌర సేవలపై యూజర్ చార్జీలు విధింపు, స్థానిక పన్నులు పెంపు, మౌలిక సదుపాయాలు ప్రైవేటీకరణ వంటి పట్టణ సంస్కరణలు అమలు చేయాలి. ఇటువంటి పట్టణాలకు ఎక్కువ ర్యాంకులు ఇస్తాయి. అలా చేయని మున్సిపల్ సంస్థలకు క్రెడిట్‌కు అర్హతలేని దిగువ స్థాయి ర్యాంకులు ఇస్తాయి. అందువల్ల రుణాల కోసం తప్పనిసరిగా సంస్కరణలు అమలు చేయాల్సి వస్తుంది. ఈ పథకంలో మరొక షరతు మున్సిపల్ రంగంలో స్వేచ్ఛగా ప్రైవేట్ పెట్టుబడులు పెట్టేందుకు ఆటంకంగా ఉన్న చట్టాలను మార్చేయాలి. పట్టణ ప్రణాళిక, జోనింగ్ విధానంలోనూ ప్రైవేట్ పెట్టుబడికి అనుకూలంగా మార్పులు చేయాలి. పట్టణ భూ (సర్టిఫికెట్ అఫ్ టైటిల్) చట్టాన్ని తీసుకొచ్చి భూమి వివరాలను డిజిటలైజేషన్ చేయాలి. టైటిల్ నెంబర్ కోడ్ విధానాన్ని ప్రవేశపెట్టాలి. ఇప్పటికే రాజస్థాన్‌లో ఈ చట్టాన్ని తీసుకొచ్చారు.

# పనిభారం పెరిగినా..వేతనాలు పెంచలేదు..



**మంగళగిరి, పతాకం న్యూస్:** విఆర్ఎల సమస్యలను పరిష్కరించకుంటే వచ్చేనెల 20వ తేదీ నుండి నిరవధిక సమ్మెకు దిగుతామని ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల (విఆర్ఎ) సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు అన్నారు. స్థానిక ఆటోనగర్‌లోని సిసిఎల్ఎ కార్యాలయం వద్ద జరిగిన ధర్నాకు సంఘం రాష్ట్ర అధ్యక్షులు షేక్ బందగి సాహెబ్ అధ్యక్ష వహించగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ విఆర్ఎలకు తెలంగాణ ప్రభుత్వము మాదిరే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా పే స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేలకు, ఎంపీలకు రూ.లక్షల వేతనాలు ఇస్తున్నా కష్టపడి పనిచేసే విఆర్ఎలను మాత్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. జీతాలు పెంచుతామనే హామీని కూటమి ప్రభుత్వం విస్మరించిందన్నారు. ప్రమోషన్లు ఇవ్వడం లేదని, నిబంధనలకు విరుద్ధంగా డ్యూటీలు వేస్తున్నారని, రీ సర్వే పేరుతో మైళ్లకొద్దీ ఇతర ప్రాంతాలకు వెళ్లి పనికి పంపుతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. పని భారం పెరిగినా టిఎ, డిఎలను మాత్రం ఇవ్వడం లేదని, ఆర్థిక సమస్యలతో విఆర్ఎల కుటుంబాలు పస్తులతో గడపాల్సిన స్థితికి నెట్టబడ్డాయని వివరించారు. బందగి సాహెబ్ మాట్లాడుతూ అర్హత ఉన్న విఆర్ఎలకు వీఆర్వోగా, రికార్డ్ అసిస్టెంట్‌గా వన్‌టైం సెటిల్మెంట్ ద్వారా ప్రమోషన్లు ఇవ్వాలని, ప్రమోషన్ కోటాను 20 శాతం నుండి 70 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. సిఐటియు గుంటూరు జిల్లా అధ్యక్షులు బి.లక్ష్మణరావు మాట్లాడుతూ ఏళ్ల తరబడి నామినీగా పనిచేస్తున్న వారిని విఆర్ఎలుగా నియమించాలన్నారు. నిత్యావసరాల ధరలు రోజురోజుకూ పెరుగుతున్నా వేతనాలు మాత్రం ఎనిమిదేళ్ల నుండి పెరగడం లేదని అన్ని స్థాయిల్లో అధికారులతోపాటు రెవెన్యూ శాఖ మంత్రికి విన్నవించుకున్నా సమస్యలను పరిష్కరించడం లేదని విమర్శించారు. అనంతరం ధర్నా వద్దకు వచ్చిన అసిస్టెంట్ కమిషనర్‌కు నాయకులు సమస్యలను వివరించి వినతిపత్రం ఇచ్చారు. విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఆయన చెప్పారు. తొలుత విఆర్ఎలు స్థానిక ఎన్ఆర్ఐ జంక్షన్ నుండి సిసిఎల్ఎ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. నాయకులు కె.రవికుమార్, త్రినాథరావు, నాగేంద్ర, సుబ్బయ్య, కొండబాబు, శేఖర్, గురుమూర్తి, గురుమోహన్, సుధాకర్, ప్రసాద్, రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుండి విఆర్ఎలు పాల్గొన్నారు.

## అన్ని నియోజకవర్గాల్లో మహిళా దినోత్సవాలు నిర్వహించాలి

**పల్నాడు జిల్లా, పతాకం న్యూస్:** అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం అన్ని నియోజకవర్గాల్లో విజయవంతం చేయాలని పల్నాడు జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా కోరారు. దీనికి సంబంధించి ముందస్తు ఏర్పాట్లపై డిఆర్ఓ, ఆర్‌డిఓ, మున్సిపల్ కమిషనర్లు, డిఆర్‌డిఎ, మెప్మా, ఐసిడిఎస్ పీడీలు, ఇతర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శుక్రవారం సమీక్షించారు. జిల్లా కేంద్రంలో నిర్వహించే కార్యక్రమానికి సంబంధించి మినిట్స్ తయారు చేయాలని, పెరేడ్ గ్రౌండ్‌లో జరిగే వేడుకల్లో 3 వేల మంది మహిళలు పాల్గొనేలా చూడాలని ఆదేశించారు. స్త్రీ శక్తి మహిళ యాప్, మహిళ పోలీస్, డిఆర్‌డిఎ, మెప్మా, సంక్షేమ శాఖలు, పరిశ్రమల శాఖ, పోలీస్, శాఖల ద్వారా స్టాల్స్ ఏర్పాటు చేయాలని, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ద్వారా వైద్య శిబిరం నిర్వహించాలని చెప్పారు. ప్రత్యేకంగా మహిళలకు అందించే పథకాలకు సంబంధించిన వనరుల పంపిణీకి సిద్ధం చేయాలని సూచించారు. జిల్లాలోని ఎంపి, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు ప్రజా ప్రతినిధులను ఆహ్వానించాలని తెలిపారు. మహిళ పారిశ్రామిక వేత్తలను సన్మానించడానికి, వారి విజయ గాథలను వారే వివరించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న 16వ జనాభా గణన ప్రక్రియను జిల్లాలో పకడ్బందీగా



నిర్వహించేందుకు సిద్ధం కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. నరసరావుపేటలోని ఎంఎం ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన మొదటి దశ 'గృహాల జాబితా, గృహ వసతుల గణన' శిక్షణా కార్యక్రమాన్ని కలెక్టర్ పరిశీలించారు. 8వ తేదీ వరకు మూడు రోజుల పాటు జరుగుతున్న ఈ శిక్షణలో జనగణన డేటా సేకరణపై అధికారులు పూర్తి అవగాహన పెంచుకోవాలన్నారు. 'మన గణన-మన భవిష్యత్తు' అనే నినాదంతో జరుగుతున్న కార్యక్రమంలో దేశ ప్రగతికి దిక్సూచి వంటిదని, సేకరించే ప్రతి అంకె అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనకు పునాది అని చెప్పారు.

## 9న ఒఆర్ఆర్ బాధిత రైతుల ధర్నా



**గుంటూరు, పతాకం న్యూస్:** అమరావతి ఔటర్ రింగ్ రోడ్ (ఒఆర్ఆర్) పరిధిలో భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేయాలని కోరుతూ ఈ నెల 9న జిల్లా కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పాశం రామారావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు, కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్షులు బి.రామకృష్ణ కోరారు. ఈ మేరకు బ్రాడిపేటలోని ప్రజాసంఘాల కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడారు. అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు కోసం జిల్లాలోని 11 మండలాల్లో 40 గ్రామాల్లో షుమారు 6వేల ఎకరాల భూములు సేకరించనున్నారన్నారు. ఒఆర్ఆర్ వల్ల ప్రభావితమయ్యే రైతులకు సమాచారం ఇవ్వకుండా, గ్రామ సభలు జరపకుండా, కనీసం రైతులకు నోటీసులు కూడా ఇవ్వకుండా 250 మీటర్ల వెడల్పుతో రోడ్డు నిర్మాణం చేయనున్నట్లుగా ప్రకటించడంతో రైతులు భయాందళనకు గురవుతున్నారని తెలిపారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం రిజిస్ట్రేషన్ విలువను ఆధారం చేసుకుని నష్టపరిహారం ఇవ్వనున్నట్లు తెలియచేయడం సరికాదన్నారు. మూడు పంటలు పండే సారవంతమైన అమరావతి, గుంటూరు నగరాలను ఆనుకొని ఉన్న ఈ భూములకు ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. ఇప్పటికే జిల్లా మండల రెవెన్యూ అధికారులకు హైవే అథారిటీ అధికారుల అర్జీల ద్వారా తమ నిరసనను తెలియచేసినా అధికారుల నుండి స్పందన లేదని రైతాంగం ఆందోళన చెందుతున్నట్లు చెప్పారు. గతంలో హైవేల నిర్మాణానికి 70 మీటర్ల వెడల్పు కోసం భూములు సేకరించి నిర్మాణం చేశారని, ఇప్పుడు 250 మీటర్లు వెడల్పుకు భూసేకరణ ఎందుకని ప్రశ్నించారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం ముందుగా గ్రామాల్లో సంబంధింత రైతులందరికీ తెలియచేసి గ్రామ సభలు జరిపి వారి అనుమతితోనే భూములు తీసుకోవాల్సివుందని, మూడు పంటలు పండే సారవంతమైన భూములను తప్పని సరిపరిస్థితి అయితే తప్ప తీసుకోరాదని చట్టం నిర్దేశిస్తుందని ఇలాంటి స్థితిలో పెద్ద మొత్తంలో భూములు తీసుకోవడం సరికాదని వివరించారు. ప్రధానంగా ఇళ్లు, పశువుల పాకలు, వారు వినియోగించే ఖాళీ స్థలాలకు సైతం తగిన నష్టపరిహారం ఇచ్చి, వారికి అవసరమైతే పునరావాసం కల్పించిన తరువాతే పనులు ప్రారంభించాల్సి ఉందన్నారు. ఈ నేపథ్యంలో బాధితుల భయాందోళనను తొలిగించే ప్రయత్నం అధికారులు చేయాలని, వెంటనే గ్రామ సభలు జరిపి ప్రజల అభిప్రాయాలు సేకరించాలని, 70 మీటర్లకు మించి సేకరణ చేయవద్దని, ప్రస్తుత మార్కెట్ రేటు ప్రకారం పరిహారం చెల్లించాలని కోరారు. ఈ అంశాలపై చేపట్టే ధర్నాలో ప్రభావిత రైతులుపెద్ద సంఖ్యలో పాల్గొనాలన్నారు. సమావేశంలో రైతుసంఘం నాయకులు బిక్కి శ్రీనివాసరావు, పోరాట కమిటీ నాయకురాలు కె.పద్మావతి, జి.సాంబశివరావు పాల్గొన్నారు.

## జంగారెడ్డిగూడెంలో ఆపరేషన్ "వజ్రప్రహార్"



**జంగారెడ్డిగూడెం, పతాకం న్యూస్:** మాదకద్రవ్యాల రహిత జిల్లాగా ఏలూరును తీర్చిదిద్దే లక్ష్యంతో జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో "ఆపరేషన్ వజ్రప్రహార్" కార్యక్రమాన్ని శనివారం తెల్లవారుజాము నుంచి జంగారెడ్డిగూడెంలో నిర్వహించారు. పట్టణంలోని రాముడు కుంట చెరువు పరిసర ప్రాంతాల్లో భారీ స్థాయిలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో పోలీస్ శాఖకు చెందిన సుమారు 50 మంది సిబ్బంది పాల్గొన్నారు. ప్రతి ఇంటిని, అనుమానాస్పద ప్రదేశాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. గంజాయి నిల్వలు, అక్రమ రవాణా మరియు ఇతర అక్రమ కార్యకలాపాలకు పాల్పడే అనుమానితులపై ప్రత్యేకంగా నిఘా పెట్టారు. ఈ కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం.వి. సుభాస్, ఎస్ఐ వీర ప్రసాద్, చింతలపూడి ఎస్ఐ సతీష్ కుమార్, తడికలపూడి ఎస్ఐ చిన్నారావు, ధర్మాజిగూడెం ఎస్ఐ వెంకన్నతో పాటు పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. తనిఖీల అనంతరం అధికారులు స్థానిక ప్రజలతో సమావేశమై మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాల గురించి అవగాహన కల్పించారు. గంజాయి వంటి మాదకద్రవ్యాలు యువత భవిష్యత్తును నాశనం చేస్తాయని, అలాంటి అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. గంజాయి అమ్మకాలు లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1972 కు లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని అధికారులు భరోసా ఇచ్చారు.

## విజయ్ ఇంట్లో ఉండేందుకు అనుమతివ్వండి : సంగీత మరో పిటిషన్

**తమిళనాడు :** ప్రస్తుతం కోలీవుడ్ ఇండస్ట్రీ, రాజకీయ వర్గాల్లో స్టార్ హీరో విజయ్ విడాకుల వ్యవహారం హాట్ టాపిక్‌గా మారిన సంగతి విదితమే. కొద్ది రోజుల క్రితమే తనకు విజయ్ నుంచి విడాకులు ఇప్పించాలని కోరుతూ ఆయన భార్య సంగీత కోర్టును ఆశ్రయించారు. తాజాగా మరో పిటిషన్ వేశారు. విజయ్ నుంచి విడాకులు కోరడంతో ఇంట్లో ఉండేందుకు అనుమతి ఇవ్వలేదని కోర్టుకు తెలిపారు. ఈ విడాకుల ప్రక్రియ ముగిసే వరకు విజయ్ కు చెందిన నీలాంగరై ఇంట్లో ఉండేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ మరోసారి కోర్టును ఆశ్రయించారు. ప్రస్తుతం సంగీత లండన్‌లో ఉంటున్నారు. త్వరలోనే ఈ పిటిషన్ విచారణకు రానుంది. గత నెల 24న తమిళనాడులోని చెంగల్పట్టు ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టులో సంగీత విడాకుల పిటిషన్ వేశారు. ఏప్రిల్ 20న వీరి విడాకుల కేసు విచారణకు రానుంది.

## కోర్టు ప్రాంగణంలో మహిళ ఆత్మహత్యాయత్నం..



**తెనాలి, పతాకం న్యూస్:** ఆస్తి విషయంలో సొంతవారే మోసం చేశారు.. న్యాయవాదిని ఆశ్రయిస్తే వాయిదాలంటూ 15 ఏళ్లు వెళ్లదీశారు. కోర్టులో కేసు ఉందో లేదో తెలియదు.. వాయిదాలని పిలిపించిన ప్రతిసారీ నా భర్త, తల్లితో కలిసి కోర్టు వద్దకు వస్తూనే ఉన్నాం.. మళ్లీ మళ్లీ వా యిదా అంటూ న్యాయవాది చెప్పుకొస్తు న్నారు.. తిరిగి తిరిగి భర్త, తల్లి కూడా కాలం చేశారు. విసుగు చెంది తాను కూడా ఆత్మహత్యాయత్నం చేశానని స్థానిక అయితానగర్‌కు చెందిన మంద్రు కమలమ్మ వాపోయారు. కమలమ్మ మున్సిపాల్టీలో పారిశుధ్య కార్మికురాలు కాగా ఆమె తల్లి సంతోషమ్మ మృతి చెందారు. ముగ్గురు కుమార్తెల్లో ఆఖరి కుమార్తె కమలమ్మ. తల్లి సంతోషమ్మ తన పెద్ద కుమార్తెకు చందోలులో రెండున్నర సెంట్లు స్థలం ఇచ్చి ఇల్లు కట్టించింది. అదే సమయంలో మనుమడు కట్టుపల్లి సుమన్‌ను కూడా తెనాలిలో ఉంచింది. కాలక్రమంలో సుమన్ అమ్మమ్మను నమ్మించి ఇల్లు తన పేరున రాయించు కున్నాడు. విషయం తెలుసుకున్న కమలమ్మ పెద్దల ద్వారా పరిష్కారానికి ప్రయత్నించగా అది సాధ్యం కాలేదు. ఫలితంగా ఆమె న్యాయవాది రాజారత్నంను ఆశ్రయించి కోర్టులో దావా వేయాలని కోరారు. వాయిదా ఉందని పిలిచిన ప్రతిసారి కోర్టుకు హాజరవుతూనే ఉన్నామని, ఏ రోజు కోర్టు హాలులోకి తీసుకెళ్లలేదని, కేసు వాయిదా పడిందని చెబుతూనే 15 ఏళ్లు గడిపారని బాధితురాలు వాపోయింది. న్యాయవాది సుమన్‌తో లాలూచీ పడ్డారని ఆరోపించారు. న్యాయవాది తనను మోసం చేశాడన్న భావనతోనే తన తల్లి మృతి చెందిన రోజునే తను కూడా ఆత్మహత్య చేసుకోవాలని భావించి కోర్టు ప్రాంగణంలో ఒంటిపై పెట్రోల్ పోసుకున్నట్లు చెప్పారు. అయితే వెంటనే స్పందించిన కోర్టు ప్రాంగణంలోని జనం ఆమెను నిలువరించారు. కోర్టు కానిస్టేబుల్ గమనించి ఆమెను పట్టణ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించగా పోలీసులు కౌన్సెలింగ్ ఇస్తున్నారు.

## ఆత్మహత్యకు పాల్పడబోయిన యువకుడిని రక్షించిన పోలీసులు

**ప్రకాశం, పతాకం న్యూస్:** తాను ప్రేమించిన యువతి వేరే వ్యక్తిని పెళ్లాడటంతో మనస్థాపం చెంది ఆత్మహత్యకు పాల్పడబోయిన ఓ యువకుడిని కంభం పోలీసులు కాపాడారు. శనివారం పోలీసులు తెలిపిన వివరాల మేరకు .... కృష్ణా జిల్లా అవనిగడ్డకు చెందిన లింగం గౌతం అనే యువకుడు లండన్ లో మాస్టర్స్ డిగ్రీ చేశాడు. గౌతమ్ కొన్నాళ్లుగా కంభం లో నివాసం ఉంటున్నాడనీ, చదువుకునే సమయంలో అతడు తన క్లాస్మేట్ ను ప్రేమించినట్లు సమాచారం. అయితే ఆ అమ్మాయిని వేరే వ్యక్తికి ఇచ్చి పెళ్లి చేయడంతో మనస్థాపం చెంది ఆత్మహత్యకు పాల్పడబోయాడు. ఈ మేరకు గౌతం తన స్నేహితునికి 'మిస్ యు' అని మెసేజ్ పెట్టడంతో ఆందోళన చెందిన స్నేహితులు .... వెంటనే 112 కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వెంటనే స్పందించిన కంభం ఎస్సై శివ కఅష్ణారెడ్డి తన సిబ్బందితో కలిసి గౌతమ్ ఫోన్ సెల్ ఫోన్ ద్వారా ట్రేస్ అవుట్ చేసి అతను కంభం రైల్వే స్టేషన్ లో సమీపంలో ఉన్నట్లు తెలుసుకున్నారు. గౌతమ్ ను అదుపులోకి తీసుకొని అతని సోదరికి సమాచారం అందించి ఆమెను పిలిపించి గౌతమ్‌ను అప్పజెప్పారు.

# ప్రీ డయాబెటిస్ ఎందుకు వస్తుంది..?



ప్రీ డయాబెటిస్ ఎందుకు వస్తుంది..? దీన్నుంచి బయట పడాలంటే ఏం చేయాలి..? ప్రస్తుత కాలంలో చాలా మంది వయసుతో సంబంధం లేకుండా టైప్ 2 డయాబెటిస్ బారిన పడుతున్నారు. అయితే ఈ వ్యాధి ఆకస్మాత్తుగా రాదు. ఇది సంవత్సరాల పాటు నెమ్మదిగా అభివృద్ధి చెందుతుంది. అలాగే రక్తంలో చక్కెర స్థాయిలు టైప్ 2 డయాబెటిస్ గా నిర్ధారించేంత లేనప్పుడు దీనిని ప్రీ డయాబెటిస్‌గా పరిగణిస్తారు. ప్రస్తుత కాలం లో చాలా మంది వయసుతో సంబంధం లేకుండా టైప్ 2 డయాబెటిస్ బారిన పడు తున్నారు. అయితే ఈ వ్యాధి ఆకస్మాత్తుగా రాదు. ఇది సంవత్సరాల పాటు నెమ్మదిగా అభివృద్ధి చెందుతుంది. అలాగే రక్తంలో చక్కెర స్థాయిలు టైప్ 2 డయాబెటిస్ గా నిర్ధారించేంత లేనప్పుడు దీనిని ప్రీ డయాబెటిస్ గా పరిగణిస్తారు. ప్రీ డయాబెటిస్ ను నియంత్రించకపోతే టైప్ 2 డయాబెటిస్ వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ప్రీ డయాబెటిస్ రావడానికి సరైన కారణాలు ఇంకా తెలియదనే చెప్పవచ్చు. కానీ అనేక అంశాలు దాని అభివృద్ధికి దోహదం చేస్తాయి. శరీర కణాలు ఇన్సులిన్ కు తక్కువగా ప్రతిస్పందిస్తాయి. దీంతో రక్తంలో చక్కెర స్థాయిలు పెరుగుతాయి. కుటుంబ చరిత్ర కారణంగా కూడా మధుమేహం వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అధిక బరువు, పొట్ట చుట్టూ కొవ్వు ఎక్కువగా పేరుకుపోవడం వంటి కారణాలు కూడా ప్రీ డయాబెటిస్‌కు దారి తీస్తాయి. అలాగే 45 ఏళ్లు పైబడిన వారిలో కూడా ప్రీ డయాబెటిస్ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. స్త్రీలల్లో పిసిఒడి వంటి సమస్యలు కూడా ప్రీడయాబెటిస్ కు దారి తీస్తాయి. ప్రీడయాబెటిస్ ను ముందుగానే నియంత్రించడం వల్ల టైప్ 2 డయాబెటిస్ బారిన పడకుండా కాపాడుకోవచ్చు. ఇన్సులిన్ సెన్సిటివిటీని మెరుగుపరిచే, రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించే జీవనశైలి మార్పుల ద్వారా ప్రీ డయాబెటిస్ ను తిప్పి కొట్టవచ్చని వైద్యులు చెబుతున్నారు. ప్రీ డయాబెటిస్ తో బాధపడే వారు ఎటువంటి జీవనశైలిని పాటించడం వల్ల దానిని తిప్పికొట్టవచ్చో ఇప్పుడు తెలుసుకుందాం. శరీర బరువును అదుపులో ఉంచుకోవాలి. శరీర బరువులో కనీసం 5 నుండి 7 శాతం తగ్గాలి. ఇలా చేయడం వల్ల టైప్ 2 డయాబెటిస్ వచ్చే అవకాశం 50 శాతం వరకు తగ్గుతుంది.

సంపూర్ణ సమతుల్య ఆహారాన్ని తీసుకోవాలి. చక్కెరలు, ప్రాసెస్ చేసిన ఆహారాలు, శుద్ధి చేసిన కార్బొహైడ్రేట్స్ ఉన్న ఆహారాలను తీసుకోకూడదు. ప్రోటీన్స్, కూరగాయలు, తృణ ధాన్యాలు, ఆరోగ్యకరమైన కొవ్వులు ఉన్న ఆహారాలను తీసుకోవాలి. అలాగే రోజూ వ్యాయామం చేయాలి. నడక, సైక్లింగ్ వంటి వ్యాయామాలు చేయాలి. వారానికి రెండు సార్లు కండరాలను బలపరిచే శిక్షణ వ్యాయామాలు చేయాలి. ఇలాంటి వ్యాయామాలు చేయడం వల్ల శరీరం గ్లూకోజ్ ను సమర్థవంతంగా గ్రహిస్తుంది. ఇన్సులిన్ సెన్సిటివిటీ, హార్మోన్ల అసమతుల్యత వంటి సమస్యల నుండి బయటపడడానికి రోజూ 7 నుండి 9 గంటల పాటు నిద్రపోవాలి. దీర్ఘకాలిక ఒత్తిడి కారణంగా కార్టిసాల్ ఎక్కువగా ఉత్పత్తి అవుతుంది. ఇది రక్తంలో చక్కెరను పెంచుతుంది. కనుక ఒత్తిడి తగ్గేలా ప్రతిరోజూ 10 నుండి 15 నిమిషాలపాటు ధ్యానం, శ్వాస వ్యాయామాలు చేయాలి.

ధూమపానం ఇన్సులిన్ నిరోధకతను పెంచుతుంది. కనుక ధూమపానానికి దూరంగా ఉండాలి. దీని వల్ల చక్కెర స్థాయిలు స్థిరంగా ఉండడంతో పాటు గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. తీసుకునే ఆహారం, జీవనశైలి రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను ఎలా ప్రభావితం చేస్తున్నాయో పర్యవేక్షిస్తూ ఉండాలి. అలాగే క్రమం తప్పకుండా వైద్యుడిని సంప్రదించి గ్లూకోజ్ స్థాయిల్లో వచ్చే మార్పులను తెలుసుకుంటూ ఉండాలి. ప్రీ డయాబెటిస్ నిర్ధారణ ఆందోళనకరంగానే ఉంటుంది. అయితే జీవనశైలిలో, ఆహారంలో మార్పులు చేసుకోవడం వల్ల టైప్ 2 డయాబెటిస్ వచ్చే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయి. ముందస్తు చర్యలతో టైప్ 2 డయాబెటిస్ బారిన పడకుండా కాపాడుకోవచ్చని వైద్యులు తెలియజేస్తున్నారు.

# అపరాలకు స్వస్తి... మొక్కజొన్నపై మొగ్గు చూపుతున్న రైతులు



**కొయ్యూరు, పతాకం న్యూస్:** రైతులు మొక్కజొన్న సాగుపై ఆసక్తి చూపుతున్నారు. అపరాల సాగు కంటే అధిక ఆదాయం వస్తుండడంతో మొక్కజొన్న సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. రెండేళ్ల క్రితం వరకు జిల్లా వ్యాప్తంగా సుమారు 15,500 ఎకరాల్లో సాగు చేసే మొక్కజొన్న ఈ ఏడాది 30 వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారంటే ఎంతగా విస్తరించిందో అర్థం చేసుకోవచ్చు. రైతాంగం మొక్కజొన్న సాగుకు మొగ్గు చూపిస్తుండడంతో సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. మొక్కజొన్నకు ఎకరాకు పెట్టుబడులు పోనూ రూ.30 వేలు ఆదాయం వస్తుండడంతో దీని సాగుకు ఆసక్తి చూపుతున్నారు. ఒకప్పుడు మండల వ్యాప్తంగా ఖరీఫ్ సాగు అనంతరం కంది, పెసర, మినుము, రాజ్‌మా వంటి పప్పు దినుసుల సాగు విస్తారంగా కనిపించేది. అటువంటిది ఇప్పుడు వాటి స్థానంలో మొక్కజొన్న సాగు దర్శనమిస్తున్నది. గత రెండు సంవత్సరాల క్రితం వరకు జిల్లా వ్యాప్తంగా సాగునీటి వసతి ఉన్న భూముల్లో సుమారు 15,500 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేసేవారు. ఈ ఏడాది సాగు విస్తీర్ణం 30 వేల ఎకరాలకు చేరింది. మొక్కజొన్నను కోళ్లఫారాలు నిర్వహించేవారు, అలాగే చేపల పెంపకానికి దాణాగా వినియోగిస్తుండడంతో డిమాండ్ పెరిగింది. ఇక పెట్టుబడి విషయానికి వస్తే ఎకరాకు కేవలం రూ.10 వేల నుంచి రూ.15 వేల మధ్యలో అవుతుండగా, దిగుబడి ద్వారా ఎకరాకు రూ.40 వేల నుంచి రూ.50 వేల మధ్యలో ఆదాయం వస్తోంది. దీంతో జిల్లాతో పాటు మండలంలోనూ మొక్కజొన్న సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఇందులో భాగంగా గత సంవత్సరం స్వల్పంగా సాగు చేసే మొక్కజొన్న ఈ సంవత్సరం కొయ్యూరు, మంప, రేవళ్లు, మర్రివాడ, తదితర పంచాయతీల్లో సుమారు 1,500 ఎకరాలకు ఈ సాగు విస్తరించింది. ముఖ్యంగా సాగునీటి వసతి గల మల్లికార్జునస్వామి చెక్‌డ్యాం, చీడిపాలెం చెక్‌డ్యాం కింది ఆయకట్టు భూములతో పాటు బోర్లు ఉన్న భూముల్లో మొక్కజొన్న సాగుకు రైతాంగం ఉపక్రమించారు. గతంలో ఆహార అవసరానికి ఈ మొక్కజొన్నను సహజసిద్ధంగా లభించే ఎరువులు వినియోగించి సాగు చేసేవారు. ప్రస్తుతం వాణిజ్య అవసరాలకు పండించడంతో మొక్కజొన్నను అధిక దిగుబడులు వచ్చే హైబ్రీడ్ విత్తనాలను వినియోగించి సాగు చేస్తున్నారు. దీనికి తోడు ఈ ప్రాంతం మొక్కజొన్న సాగుకు అనుకూలంగా ఉండడం ధర సైతం పెరిగి రైతుకు మంచి ఆదాయం వస్తోంది. అయితే దీని సాగు మరింత విస్తరించే అవకాశాలు మెండుగా ఉన్నప్పటికి ఈ ప్రాంత రైతులకు ప్రభుత్వం నుంచి కనీస ప్రోత్సాహం అందడం లేదు. మొక్కజొన్న ఖండి నుంచి గింజలు వేరు చేసేందుకు యంత్రాలు వినియోగిస్తే సులువుగా పని అవుతుంది. ఆ తరహా యంత్రాలు రాయితీపై అందించేలా సంబంధిత వ్యవసాయ శాఖ చర్యలు చేపట్టడం లేదు. అలాగే మేలిరకం విత్తనాలు రాయితీపై అందిస్తే ఈ సాగు చేసే రైతులను మరింత ప్రోత్సహించినట్టు అవుతుంది. వేసవి ఆరంభంలో సాగు చేసే ఈ పంటకు సాగునీటి సరఫరాకు అవసరమైన వాటర్ ఇంజన్లు, పైపులు, తదితర సామగ్రిని రాయితీపై సరఫరా చేసేలా ఐటీడీఏ చర్యలు చేపడితే మొక్కజొన్న సాగు ప్రస్తుతం జరుగుతున్న దానికి రెట్టింపు అయ్యే అవకాశాలు ఉన్నాయి. తద్వారా వేసవిలో జీవనోపాధికి వలసలు వెళ్లేవారికి స్థానికంగా ఉపాధి దొరుకుతుంది. ముఖ్యంగా డిసెంబరు నుంచి తిరిగి జూలై వరకు పశువులను వదిలేయడం వలన అన్ని వసతులు ఉన్న సాగు భూములు బీడులుగా మారుతున్నాయి. మొక్కజొన్న సాగు విస్తీర్ణం మరింత పెరిగితే పశువుల కట్టడి జరుగుతుంది. ఈ విషయాలపై ఉన్నతాధికారులు దృష్టి సారించి గిరిజనుల ఆర్థికాభివృద్ధికి దోహదపడుతున్న మొక్కజొన్న సాగును అన్ని విధాల ప్రోత్సహించేలా చర్యలు చేపట్టాలని పలువురు రైతులు కోరుతున్నారు.

## విద్యార్థులకు పోలీసుల ఓపెన్ హౌస్



**నరసరావుపేట, పతాకం న్యూస్:** మహిళా దినోత్సవ వారోత్సవాలలో భాగంగా 'ఓపెన్ హౌస్' కార్యక్రమాన్ని నరసరావుపేటలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించారు. మహిళా భద్రత, అత్యవసర వ్యవస్థ, డయల్ 100/112, భద్రతా యాప్‌ల ఉపయోగం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పోలీసులు విధుల్లో ఉపయోగించే ఆధునిక ఆయుధాలు, తుపాకులు, పిస్టల్స్ గురించి, కమ్యూనికేషన్ పరికరాలు, సెఫ్టీ గాడ్జెట్‌లు, మిషనరీ గురించి ప్రాక్టికల్ డెమో ఇచ్చారు. అత్యవసర పరిస్థితుల్లో మహిళలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, హెల్ప్‌లైన్ నంబర్లు, స్వీయ రక్షణ పద్ధతులపై మెలకువలు వివరించారు. విద్యార్థినులు పోలీసు సేవలపై ప్రశ్నలు అడిగి, తమ సందేహాలను నివత్తి చేసుకున్నారు. మహిళా పోలీసులు సమాజ రక్షణలో పోషించే కీలక పాత్ర గురించి వివరించారు. నైతిక విలువలు, ధైర్యసాహసాలు, లైంగిక వేధింపుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పిలు వి.సత్తిరాజు, లక్ష్మీపతి, నరసరావు, మహిళా పోలీస్ స్టేషన్ సిఐ సుభాషిణి, అడ్మిన్ ఆర్ఐ ఎం.కృష్ణ పాల్గొన్నారు.

మాచర్ల స్థానిక పోలీస్ స్టేషన్‌లో పట్టణ సిఐ వెంకటరమణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పోలీసుల విధులు, ప్రజల భద్రత కోసం చేపడుతున్న కార్యక్రమాలు, నేర నియంత్రణలో పోలీసుల పాత్రపై పలు పాఠశాలల విద్యార్థులకు అవగాహన కల్పించారు. పోలీసులు విధుల్లో వినియోగించే ఆయుధాలు, వాటి ఉపయోగం గురించి వివరించారు. ఎక్కడైనా వేధింపులు, సమస్యలు ఎదురైతే భయపడకుండా వెంటనే పోలీసులను సంప్రదించాలన్నారు. మహిళల భద్రత కోసం పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు వెంటనే డయల్ 100కు సమాచారం అందించాలని ఎస్పై సూచించారు. పోలీస్ శాఖ ప్రజల భద్రత కోసం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు సమాజానికి ఉపయోగపడే విధంగా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, చట్టాలను గౌరవిస్తూ మంచి పౌరులుగా ఎదగాలని సూచించారు. శాంతి, భద్రత పరిరక్షణలో పోలీసులకు యువత సహకరించాలని కోరారు.




## టీ20 ప్రపంచకప్ 2026 ఎవరికి దక్కేనో?



టీ20 ప్రపంచకప్ 2026 తుది సమరానికి చేరుకుంది. ఆదివారం అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా భారత్- న్యూజిలాండ్ జట్లు టైటిల్ కోసం పోరాడనున్నాయి. గతంలో 2023 వన్డే వరల్డ్‌కప్ ఫైనల్‌లో ఇదే స్టేడియంలో ఆస్ట్రేలియా చేతిలో ఎదురైన ఓటమి గాయం ఇంకా బాధిస్తున్నా, ప్రస్తుతం టీమ్‌ఇండియా ఉన్న ఫామ్ చూస్తుంటే ఆ భయాలన్నీ మాయమవుతున్నాయి. ఒకప్పుడు ఐసీసీ ఈవెంట్లలో న్యూజిలాండ్ అంటేనే భారత్‌కు ఒక శాపంలా ఉండేది, కానీ కాలం మారింది. గత నాకౌట్ మ్యాచ్?లో కివీస్‌ను మట్టికరిపించిన భారత్, ఇప్పుడు అదే జోరును ఫైనల్‌లోనూ కొనసాగించాలని చూస్తోంది. అభిమానుల్లో అయితే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో గతంలో ఈ రెండు జట్ల మధ్య జరిగిన నాకౌట్ పోరాటాలు ఎలా సాగాయో ఇప్పుడు వివరంగా చూద్దాం. భారత్, న్యూజిలాండ్ జట్లు మొదటిసారి ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ నాకౌట్ ఫైనల్‌లో 2000 సంవత్సరంలో నైరోబీ వేదికగా తలపడ్డాయి. ఆ మ్యాచ్‌లో కెప్టెన్ సౌరభ్ గంగూలీ అద్భుతమైన సెంచరీ (117 పరుగులు) బాదాడు. ఇప్పటికీ ఒక ఐసీసీ ఫైనల్‌లో సెంచరీ చేసిన భారత ఏకైక బ్యాటర్‌గా గంగూలీ పేరిటే రికార్డు ఉంది. సచిన్ తెందుల్కర్ (69) తో కలిసి గంగూలీ భారత్‌కు 264 పరుగుల గౌరవప్రదమైన స్కోరును అందించాడు. అయితే ఛేదనలో కివీస్ ఆల్ రౌండర్ క్రిస్ కెయిర్న్స్ (102 నాటౌట్) అజేయ శతకంతో చెలరేగి భారత్ ఆశలపై నీళ్లు చల్లాడు. చివరి ఓవర్‌లో రెండు బంతులు మిగిలి ఉండగానే న్యూజిలాండ్ విజయం సాధించి తమ తొలి వైట్ బాల్ ఐసీసీ ట్రోఫీని కైవసం చేసుకుంది.

## లోపాలను సరిచేసుకోకపోతే.. ఫైనల్లో టీమిండియాకు కష్టమే?



టీ20 వరల్డ్‌కప్ టైటిల్‌ను నిలబెట్టుకునేందుకు టీమిండియా ఆదివారం న్యూజిలాండ్‌తో అమీతుమీ తేల్చుకోనుంది. సెమీస్‌లో ఇంగ్లండ్‌పై ఉత్కంఠ విజయం అందుకున్న సూర్యకుమార్ సేన దృష్టంతా ఇప్పుడు చాంపియన్‌గా నిలవడంపైనే ఉంది. 2023 వన్డే వరల్డ్‌కప్ ఫైనల్ జరిగిన నరేంద్ర మోదీ స్టేడియంలోనే ఈ మ్యాచ్ తుదిపోరు కూడా జరుగనుంది. అయితే మూడేళ్ల క్రితం ఆ పోరులో ఆస్ట్రేలియా చేతిలో పరాభవం ఎదురవడంతో.. ప్రస్తుత మ్యాచ్ ఫలితంపైనా అభిమానుల్లో ఆందోళన కనిపిస్తోంది. దీనికి తోడు జట్టులో అన్ని విభాగాలు పటిష్టంగా ఉన్నాయా? అంటే లేదనే సమాధానం వినిపిస్తోంది. మరి.. వీటిని అధిగమిస్తేనే కప్పుపై ఆశలు.

ఇంగ్లండ్‌తో సెమీస్‌లో బౌలర్ల వైఫల్యం మరోసారి బహిర్గతమైంది. బ్యాటర్ల రాణింపుతో భారత్ 253/7 స్కోరుతో అత్యంత పటిష్ఠ స్థితిలో నిలిచింది. మనకు వరల్డ్ క్లాస్ బౌలర్లు అండగా ఉన్న వేళ.. ప్రత్యర్థి ఈ స్కోరు దరిదాపుల్లోకి కూడా రాదేమో అనే ధీమా అందరిలోనూ కనిపించింది. కానీ తీరా మ్యాచ్ ముగిశాక భారత్ గెలిచింది కేవలం 7 పరుగుల తేడాతోనే కావడం ఒకింత షాకింగ్‌గా మారింది. ఆ మ్యాచ్‌లో స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి ఎకానమీ 16 కాగా.. అక్షర్ పటేల్‌ది 11.7గా ఉంది. దీంతో కెప్టెన్ సూర్యకు ముందుగానే బుమ్రాతో ఓవర్లు వేయించాల్సి వచ్చింది. ఇక చివరి ఓవర్ కోసం అక్షర్, శివమ్ దూబె తప్ప మరో ఆప్షన్ లేకపోయింది. అందరూ భయపడినట్టు దూబేకే బంతి ఇవ్వగా, ఆర్చర్ సిక్సర్ల మోతకు అతను 22 రన్స్ ఇచ్చుకున్నాడు. వాంఖడే ఫ్లాట్ ట్రాక్‌పై బుమ్రా మినహా మరో బౌలర్ ప్రభావం చూపలేకపోయాడు. బ్యాటింగ్ ఆర్డర్ బాగున్నా, పరిస్థితులు బాగాలేనప్పుడు ఆదుకునేందుకు ఆరో బౌలర్ లేకపోవడం లోటుగా కనిపిస్తోంది. ఇక ఫైనల్‌కు వేదికపై వరుణ్‌కు మెరుగైన రికార్డు ఉండడంతో అతడిని కొనసాగిస్తారా? లేదంటే కుల్దీప్‌ను తీసుకుంటారా? అన్నది చూడాలి. బుమ్రా ఒక్కడే ఫైనల్లో ఆదుకోలేడు కాబట్టి కోచ్, కెప్టెన్ తమ ప్లాన్ 'బి' గురించి ఆలోచించాల్సిందే.

సెమీస్‌లో అక్షర్ పటేల్ రెండు అద్భుత క్యాచ్‌లతో ఆకట్టుకున్నాడు. కానీ ఓవరాల్‌గా గమనిస్తే మాత్రం అంత సీన్ లేదు. టోర్నీలో ఓవరాల్‌గా 13 క్యాచ్‌లను వదిలేసి ఇతర జట్లకన్నా మనం ముందుండడం గమనార్హం. క్యాచ్‌లు జారవిడిచే విషయంలో గతేడాది నుంచి కూడా అభిషేక్‌లో ఎలాంటి మెరుగుదలలేదు. అలాగే మోదీ స్టేడియంలో ఫ్లడ్ లైట్లు కాకుండా రింగ్ ఆఫ్ ఫైర్ తరహాలో వెలుతురు ఉంటుంది కాబట్టి ఫీల్డింగ్ సవాల్‌గా మారుతుంది. దీనికి తగ్గట్టుగా ఫైనల్‌కు ముందే ఫీల్డర్లు క్యాచ్ ప్రాక్టీస్ చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కీలక ఫైనల్లో జట్టుకు అండగా నిలిచే బ్యాటర్ ఎవరనే సందేహం అందరి మదిలో నెలకొంది. శాంసన్ ఫామ్ అతిపెద్ద బలంగా మారింది. కానీ తనకు ఇతర బ్యాటర్ల నుంచి సహకారం లభించాల్సి ఉంది. అభిషేక్ శర్మ ఫామ్‌లేమితో ఇబ్బందిపడుతూ కేవలం ఒక్క హాఫ్ సెంచరీ మాత్రమే సాధించాడు. అయినా తుది పోరులో అతడినే కొనసాగించే అవకాశం ఉంది. ఎందుకంటే రిజర్వ్ బెంచీలో స్పెషలిస్ట్ బ్యాటర్ రింకూ సింగ్ మాత్రమే ఉన్నాడు. అతడి ఫామ్ కూడా మెరుగ్గా ఏమీ లేదు. అందుకే కుడి-ఎడమ కాంబినేషన్ కోసం శర్మనే కొనసాగిస్తూ తను ఫామ్‌లోకి రావాలని కోరుకోవాల్సి ఉంటుంది. అలాగే కెప్టెన్ సూర్యకుమార్ నుంచి పెద్ద ఇన్నింగ్స్ రావడం లేదు. యూఎస్ఏపై అర్ధసెంచరీ మినహా ప్రభావం చూపలేదు. దీనికితోడు నాకౌట్ మ్యాచ్‌ల్లో అతడు 20 రన్స్ లోపే వెనుదిరిగిన రికార్డు ఉంది. ఐసీసీ ఫైనల్లో రోహిత్, విరాట్ మాదిరి ప్రస్తుత జట్టులో ఒత్తిడి లేకుండా ఆడే అనుభవం చాలా మందికి లేదు. అందుకే కివీస్‌ను ఓడించాలంటే లోపాలను సరిచేసుకుని జట్టంతా అద్భుతంగా చెలరేగాల్సిందే.




# మూడో షెడ్యూల్ పూర్తి చేసుకున్న 'శ్రీనివాస మంగాపురం'



సూపర్ స్టార్ మహేశ్ బాబు అన్న కుమారుడు జయకృష్ణ ఘట్టమనేని వెండితెరకు హీరోగా పరిచయమవుతున్న చిత్రం... 'శ్రీనివాస మంగాపురం'. 'ఆర్ఎక్స్ 100', 'మంగళవారం' వంటి రా అండ్ రస్టిక్ చిత్రాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు అజయ్ భూపతి ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది. తాజాగా తిరుపతిలో చేపట్టిన కీలకమైన మూడో షెడ్యూల్‌ను చిత్రయూనిట్ విజయవంతంగా పూర్తి చేసింది. ఈ షెడ్యూల్‌లో హీరో జయకృష్ణ, హీరోయిన్ రాషా తడాని, ఇతర ప్రధాన తారాగణంపై ముఖ్యమైన సన్నివేశాలను చిత్రీకరించినట్లు సమాచారం. ఈ షెడ్యూల్ ముగియడంతో సినిమా షూటింగ్ దాదాపు 60 శాతం పూర్తయింది. భారీ నిర్మాణ విలువలతో, ఎక్కడా రాజీపడకుండా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు చిత్రవర్గాలు తెలిపాయి.

సూపర్ స్టార్ కృష్ణ, మహేశ్ బాబు నటవారసత్వాన్ని కొనసాగిస్తూ జయకృష్ణ ఎంట్రీ ఇస్తుండటంతో అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అలాగే, ప్రముఖ బాలీవుడ్ నటి రవీనా టాండన్ కుమార్తె రాషా తడాని ఈ సినిమాతోనే టాలీవుడ్‌కు పరిచయమవుతుండటం మరో విశేషం. ఈ చిత్రంలో సీనియర్ నటుడు మోహన్ బాబు 'వెంకటప్పయ నాయుడు' అనే కీలక పాత్రలో కనిపించనున్నారు. ప్రముఖ నిర్మాత అశ్వినీదత్ సమర్పణలో, చందమామ కథలు బ్యానర్‌పై పి. కిరణ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు జాతీయ అవార్డు గ్రహీత జి.వి. ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తుండగా, జయకృష్ణ గుమ్మడి సినిమాటోగ్రఫీ, సాహి సురేష్ ప్రొడక్షన్ డిజైన్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అజయ్ భూపతి మార్క్ టేకింగ్, కొత్త జంట పరిచయంతో ఈ సినిమాపై సినీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

# శర్వానంద్ 'భోగి' ఫస్ట్ లుక్..

టాలీవుడ్ హీరో శర్వానంద్ పుట్టినరోజు సందర్భంగా ఆయన నటిస్తున్న తాజా చిత్రం 'భోగి' నుంచి మేకర్స్ ఆసక్తికరమైన అప్డేట్ ఇచ్చారు. సంపత్ నంది దర్శకత్వంలో శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న ఈ ఎక్స్ ప్లోజివ్ యాక్షన్ డ్రామా నుంచి శర్వానంద్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో శర్వా పోషిస్తున్న పాత్ర పేరు 'గంగ' అని వెల్లడించారు.

విడుదలైన పోస్టర్‌లో శర్వా నంద్ మునుపెన్నడూ చూడని విధంగా ఊరమాస్ లుక్‌లో కనిపిస్తున్నారు. చెదిరిన జుట్టు, గుబురు గడ్డం, నోట్లో బీడీతో పూర్తి రగ్గడ్ లుక్‌లో దర్శనమిచ్చారు. చెమటతో కూడిన ముఖం, సీరియస్ చూపులతో శర్వా లుక్ చాలా ఇంటెన్స్‌గా ఉంది. "నిశ్శబ్దంలో పుట్టిన తుపాను.. బద్దలయ్యేందుకు సిద్ధంగా ఉన్న ఆగ్రహం.. త్వరలోనే ప్రపంచం అతడి ఉగ్రరూపాన్ని 'భోగి'లో చూస్తుంది" అంటూ చిత్రబృందం సోషల్ మీడియాలో పేర్కొంది. 1960ల చివరలో ఉత్తర తెలంగాణ - మహారాష్ట్ర సరిహద్దు నేపథ్యంలో సాగే పీరియాడిక్ కథాంశంతో దర్శకుడు సంపత్ నంది ఈ చిత్రాన్ని తీర్చిదిద్దుతున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో వేసిన భారీ సెట్‌లో కీలక యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఈ చిత్రంలో అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయాతి హీరో యిన్లుగా నటిస్తున్నారు.

భీమ్స్ సిసిరోలి యో సంగీతం అందిస్తుండగా, కిరణ్ కుమార్ మన్నె ఆర్ట్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. ఆగస్టు 28న రాఖీ పండుగ కానుకగా తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఈ సినిమాను పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేయనున్నట్లు నిర్మాతలు ప్రకటించారు.




# చిరంజీవికి 'ఎన్టీఆర్ నేషనల్' అవార్డ్

గద్దర్ సినీ అవార్డు లను-2026 తెలంగాణ ప్రభు త్వం ప్రకటించింది. ఈ ప్రకటన సినీ వర్గాల్లో, అభిమా నుల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది. గతేడాది ప్రారం భమైన ఈ పురస్కారాల పరం పర, ఈసారి మరిన్ని ప్రతి ష్ఠాత్మక విభాగాలతో ముందుకు వచ్చింది. ముఖ్యంగా మెగాస్టార్ చిరంజీవికి 'ఎన్టీఆర్ నేషనల్' అవార్డు ప్రకటించడం విశేషం.తెలంగాణ ప్రభుత్వం నంది అవార్డుల స్థానంలో సినీ కళా కారులకు గద్దర్ అవార్డులను ప్రవేశపెట్టిన విషయం తెలి సిందే. దాదాపు దశాబ్ద కాలంపాటు నిలిచిపోయిన ప్రభుత్వ పురస్కారాల సంప్రదాయం రేవంత్‌రెడ్డి సర్కార్‌లో మళ్లీ ప్రారంభం కావడంతో కళాకారులకు ఎంతగానో ప్రోత్సాహంగా ఉందని సినీ ప్రముఖులు చెబుతున్నారు. ఈసారి ఉగాది రోజున సినీతారల సందడితో ఈ వేడుకను అత్యంత వైభవంగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిర్వహించనుంది.తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్' రెండో విడత విజేతలను జ్యూరీ కమిటీ ప్రకటించింది. ఈ ఏడాది అవార్డుల్లో దిగ్గజ నటీనటులు, సాంకేతిక నిపుణులకు పెద్దపీట వేశారు. ఈ ఏడాది వివిధ విభాగాల్లో ఎంపికైన ప్రముఖుల జాబితాను ప్రకటించింది. వారి వివరాలివే..

**స్పెషల్ అవార్డులు**

ఎన్టీఆర్ జాతీయ అవార్డు - చిరంజీవి. రఘుపతి వెంకయ్య అవార్డు - రమేశ్ ప్రసాద్. పైడి జయరాజ్ అవార్డు - కమల్ హాసన్, నాగిరెడ్డి చక్రపాణి అవార్డు - అశ్వనీదత్. ఏఎన్ఆర్ అవార్డు - జయసుధ. టీఎల్.కాంతారావు అవార్డు - ఆర్.నారాయణ మూర్తి. సి.నారాయణ రెడ్డి అవార్డు - సుద్దాల అశోక్ తేజ. బీఎన్ రెడ్డి అవార్డు - సింగీతం శ్రీనివాసరావు

**ఫీచర్ ఫిల్మ్స్**



ఉత్తమ చిత్రం - రాజు వెడ్స్ రాంబాయి
ఉత్తమ ద్వితీయ చిత్రం - దండోరా
ఉత్తమ తృతీయ చిత్రం - ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో
ఉత్తమ నటుడు - నాగచైతన్య (తండేల్)
ఉత్తమ నటి - రష్మిక (ది గర్ల్ ఫ్రెండ్)
ఉత్తమ దర్శకుడు - సాయిలు (రాజు వెడ్స్ రాంబాయి)
బెస్ట్ ఫీచర్ ఫిల్మ్ అన్ నేషనల్ ఇంటిగ్రేషన్ - తండేల్
ఉత్తమ సందేశాత్మక చిత్రం - కోర్ట్
ఉత్తమ ప్రజాదరణ చిత్రం - సంక్రాంతికి వస్తున్నాం
ఉత్తమ నూతన దర్శకుడు - సాయి మార్తాండ్ (లిటిల్ హార్ట్స్)
ఉత్తమ బాలల చిత్రం - అనగనగా
ఉత్తమ సహాయ నటుడు - శివాజీ (దండోరా)
ఉత్తమ సహాయ నటి - భూమిక (యుఫోరియా)
ఉత్తమ సంగీత దర్శకుడు - మార్క్ రాబిన్ (దండోరా)
ఉత్తమ గాయకుడు - అనురాగ్ కులకర్ణి (రాజు వెడ్స్ రాంబాయి)




Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**